తన వృత్తిని పవిత్రంగా,
గౌరవంగా భావించే వ్యక్తి
ఒక్క క్షణం కూడా సోమరిగా
ఉండలేదు.
- మహాత్మాగాంధీ

Truth of News
RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 01 | సంచిక : 317 | శుక్రవారం 05 జూన్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## నేటి నుండి భారత్‌లో
# నేపాల్ విదేశాంగ మంత్రి పర్యటన

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ కానల్ ఈ నెల 5 నుండి ఏడవ తేదీ వరకు భారత్‌లో పర్యటించనున్నారు. భారత విదేశాంగ మంత్రి జై శంకర్ ఆహ్వానం మేరకు ఈ పర్యటన జరుగుతోందని కేంద్ర ప్రభుత్వం గురువారం వెల్లడించింది. మే 31న నేపాల్ పార్లమెంట్‌లో ప్రధాని బాలేంద్ర షా చేసిన వ్యాఖ్యలతో నెలకొన్న వివాదం నేపథ్యంలో ఈ పర్యటన జరుగుతోంది. భారత్‌తో దీర్ఘకాలంగా సరిహద్దు వివాదం వుందని,

- మిగతా 2లో..



# ఇంధన సహకార విస్తరణ !

- ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం
- వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలితో ప్రధాని చర్చలు



**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

ప్రస్తుతం మన దేశంలో పర్యటిస్తున్న వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రొడ్రిగజ్‌తో గురువారం ప్రధాని నరేంద్ర మోడీ భేటీ అయ్యారు. బుధవారం ఇక్కడకు వచ్చిన రొడ్రిగజ్ గురువారం హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోడీతో చర్చలు జరిపారు. ఇంధనం, వాణిజ్యం, పెట్టుబడుల రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం

- మిగతా 2లో..



# సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల నియంత్రణపై దృష్టి

- మానవ అక్రమ రవాణాను నిరోధించేలా చర్యలు సుప్రీంకోర్టు పలు కీలక ఆదేశాలు

2లో



## ఏపీ రాజ్యసభ సీట్ల
# పంపకం పూర్తి..

- టీడీపీకి 3, జనసేనకు 1
- రాజ్యసభ సీట్ల పంపకాలపై కొలిక్కి వచ్చిన ఫార్ములా
- టీడీపీకి మూడు, జనసేనకు ఒక స్థానం కేటాయింపు
- ఈసారి బీజేపీకి దక్కని రాజ్యసభ అవకాశం
- సీఎం చంద్రబాబు నేతృత్వంలో జరిగిన సమావేశంలో తుది నిర్ణయం
- జూన్ 18న నాలుగు స్థానాలకు జరగనున్న పోలింగ్

**అమరావతి - సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు రాజ్యసభ స్థానాలకు సంబంధించి అధికార ఎన్డీఏ కూటమిలో సీట్ల పంపకం ఖరారైంది. కూటమిలోని ప్రధాన పార్టీ అయిన తెలుగుదేశం పార్టీ (టీడీపీ) మూడు స్థానాలను తీసుకోనుండగా, జనసేన పార్టీకి ఒక స్థానాన్ని కేటాయించారు. ఈ సర్దుబాటులో బీజేపీకి ఈసారి అవకాశం లభించలేదు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు క్యాంపు కార్యాలయంలో

- మిగతా 2లో..

## పనుల్లో వేగం పెంచండి..
# నాణ్యత ముఖ్యం

- సీఎం రేవంత్ రెడ్డి
- ఉమ్మడి పాలమూరు జిల్లాలో ముఖ్యమంత్రి సుడిగాలి పర్యటన
- మక్తల్--నారాయణపేట--కొడంగల్ ఎత్తిపోతల పనుల క్షేత్రస్థాయి పరిశీలన
- కాట్రపల్లి పంప్‌హౌస్ నిర్మాణ పురోగతిపై ఆరా..
- సాయంత్రం సోమశిలలో కీలక సమీక్ష



**హైదరాబాద్ - సూర్య వాస్తవం**

ఉమ్మడి పాలమూరు జిల్లాకు సాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన నీటిపారుదల ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయడమే ప్రభుత్వ ప్రధాన సంకల్పమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లా పర్యటనలో భాగంగా గురువారం ప్రత్యేక హెలికాప్టర్‌లో మక్తల్‌కు చేరుకున్న ముఖ్యమంత్రికి రాష్ట్ర మంత్రులు డాక్టర్ వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా మక్తల్--నారాయణపేట--కొడంగల్ ఎత్తిపోతల పథకం కింద కాట్రపల్లి గ్రామం వద్ద శరవేగంగా నిర్మాణంలో ఉన్న పంప్‌హౌస్ పనులను సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. ప్రాజెక్టు పురోగతి, ఇంజనీరింగ్ పనుల స్థితిగతులను స్థానిక మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రికి మ్యాప్‌ల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ఎట్టి పరిస్థితుల్లోనూ పనుల్లో అలసత్వాన్ని సహించేది లేదని, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూనే నిర్దేశిత గడువులోగా పంప్‌హౌస్ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాలమూరు ప్రాంతానికి సాగునీరు అందించాలనే సంకల్పంతో చేపట్టిన ఈ ప్రాజెక్టుల పురోగతిపై ఆయన ప్రత్యేకంగా ఆరా తీశారు.

- మిగతా 2లో..



# ఏపీలో పలు జిల్లాల్లో వర్షాలు

## - నేడు కూడా వర్షాలు కురిసే అవకాశం

**విశాఖపట్నం - సూర్య వాస్తవం**

ఏపీలో గురువారం పలు జిల్లాల్లో వర్షాలు కురిశాయి. సాయంత్రం ఐదు గంటల సమయానికి పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంటలో 30.5 మి.మీ., గుంటూరు జిల్లా తాడేపల్లిలో 27.2 మి.మీ., అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో

- మిగతా 2లో..

# ఏపీకి పెట్టుబడులే లక్ష్యం

- రష్యాలో జరిగిన అంతర్జాతీయ ఆర్థిక ఫోరంలో మంత్రి లోకేశ్ ప్రసంగం
- పెట్టుబడిదారులుగా కాకుండా భాగస్వాములుగా ఏపీకి రావాలని ఆహ్వానం
- 2047 నాటికి ఏపీని 2.5 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామన్న లోకేశ్
- 2030 నాటికి 100 బిలియన్ డాలర్ల భారత్-రష్యా ద్వైపాక్షిక వాణిజ్యమే లక్ష్యం- ఏపీలో స్పేస్, ఏరోస్పేస్, సెమీకండక్టర్ల రంగాల్లో పెట్టుబడులపై దృష్టి

2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## అవయవ మార్పిడి చట్టానికి
# ఆమోదం

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్ సమావేశం
- లండన్ ఐ తరహాలో అమరావతిలో 'అమరావతి ఐ' నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్
- గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని 125 రోజులకు పెంచుతూ కీలక నిర్ణయం
- రాష్ట్రానికి కొత్త విమానయాన పాలసీ, పర్యాటకాన్ని పెంచేలా బీచ్ షాక్‌ల ఏర్పాటు
- అగ్రిగోల్డ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక కోర్టుకు సిబ్బంది నియామకం, సబ్ కమిటీ ఏర్పాటు
- పోలవరం ఎడమ కాలువకు సవరించిన అంచనాలు, పలు పారిశ్రామిక ప్రాజెక్టులకు భూకేటాయింపులు



**అమరావతి - సూర్య వాస్తవం**

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి బాటలు వేసే పలు చారిత్రాత్మక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. రాజధాని అమరావతికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చే 'అమరావతి ఐ' ప్రాజెక్టు నుంచి గ్రామీణ పేదల బతుకులకు భరోసా ఇచ్చే కొత్త ఉపాధి హామీ పథకం వరకు దాదాపు 35కు పైగా కీలక అంశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించి ఆమోదముద్ర వేసింది. సమావేశం అనంతరం సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు కేబినెట్ నిర్ణయాలను సమగ్రంగా

- మిగతా 2లో..



## తెలంగాణను అస్థిరపరిచే రాజకీయాలకు
# నేను వ్యతిరేకం

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- జూన్ 2న చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగడంతో వివరణ
- పరస్పర గౌరవంతో ముందుకెళ్లడమే తన విధానమంటూ స్పష్టీకరణ
- ఎక్స్ వేదికగా పోస్ట్.. గతంలోని వీడియోను పంచుకున్న జనసేనాని

2లో

## నేటి నుండి భారత్‌లో నేపాల్ విదేశాంగ మంత్రి పర్యటన

(మొదటిపేజీ తరువాయి)

దీనిపై భారత్‌తో చర్చించడంతో పాటూ చైనా, బ్రిటన్‌లతో కూడా టచ్‌లో వున్నట్లు బాలేంద్ర షా చెప్పారు. రెండు రోజుల తర్వాత భారత్ ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది. నేపాల్‌తో గల సరిహద్దు వివాద పరిష్కారానికి తృతీయ పక్షాల జోక్యం అవసరం లేదని తేల్చి చెప్పింది. జై శంకర్‌తో శిశిర్ కానల్ సమావేశమవుతారని, పరస్పర ప్రయోజనం కలిగిన అంశాలు చర్చిస్తారని నేపాల్ ప్రభుత్వం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం, ప్రజల మధ్య సంబంధాలు వంటి రంగాల్లో సహకారాన్ని విస్తరించాలని భావిస్తున్నట్లు తెలిపింది.

## ఇంధన సహకార విస్తరణ !

(మొదటిపేజీ తరువాయి)

చేసుకోవడంపై ప్రధానంగా ఈ చర్చలు సాగాయి. ఆమె వెంట వచ్చిన ప్రతినిధి బృందంలో విదేశీ, ఆర్థిక, సైన్స్ అండ్ టెక్నాలజీ, కమ్యూనికేషన్ అండ్ ఇన్ఫర్మేషన్, రవాణా మంత్రులతో పాటు పలువురు మంత్రులు వున్నారు. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ఇంధన సరఫరాలకు ఆటంకం కలుగుతున్నందున ముడిచమురు సేకరణను వైవిధ్యపరచాలని భారత్ భావిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో భారత్ 4.3 శాతం తక్కువగా ముడి చమురును దిగుమతి చేసుకుంది. ధరలు మాత్రం 50శాతానికి పైగా పెరిగాయి. వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలి పర్యటనతో ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత బలపడతాయని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ చెప్పారు. ఈ ఏడాది జనవరిలో వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురోను అమెరికా బలగాలు నిర్బంధంలోకి తీసుకోవడంతో డెల్సీ రొడ్రిగజ్ తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారు. అమెరికా దుర్మార్గమైన ఆంక్షల నేపథ్యంలో 2020లో వెనిజులా వద్ద ముడి చమురు కొనుగోలును మనదేశం నిలిపివేయాల్సి వచ్చింది. మదురోను అమెరికా అత్యంత అమానుషంగా కిడ్నాప్ చేసిన తర్వాత ఈ ఆంక్షలు ఎత్తివేయడంతో వెనిజులా నుండి ముడి చమురు కొనుగోళ్ళను భారత్ ప్రారంభించింది.

## పనుల్లో వేగం పెంచండి.. నాణ్యత ముఖ్యం

(మొదటిపేజీ తరువాయి)

అనంతరం జూరాల, కోయిల్‌సాగర్ తదితర ప్రాజెక్టుల పరివాహక ప్రాంతాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏరియల్ సర్వే ద్వారా వీక్షించి, నీటి నిల్వ సామర్థ్యాలను పరిశీలించనున్నారు. సాయంత్రం కల్లా సోమశిలకు చేరుకుని, అక్కడ ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితులు, భవిష్యత్ కార్యాచరణ, భూసేకరణ వంటి అంశాలపై ఇరిగేషన్ ఉన్నతాధికారులతో ఒక ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ పర్యటనలో కర్ణాటక రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి బోసు రాజు, జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక, ఇరిగేషన్ శాఖ కార్యదర్శి శ్రీధర్, చీఫ్ ఇంజనీర్ ఎ. సత్యనారాయణ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ హెచ్.టి. శ్రీధర్ మరియు ఇతర ముఖ్య ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఏపీలో పలు జిల్లాల్లో వర్షాలు

(మొదటిపేజీ తరువాయి)

18.5మి.మీ.విజయనగరం జిల్లా గుర్లలో 14.5 మి.మీ. వర్షపాతం నమోదైందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. దక్షిణ తెలంగాణ,, దానిని ఆనుకొని ఉన్న కోస్తాంధ్ర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో శుక్రవారం పోలవరం, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, తదితర జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. గురువారం మార్కాపురం జిల్లా నందనమారెళ్లలో 44.7 డిగ్రీలు, అనకాపల్లి జిల్లా దేవరాపల్లిలో 43.8, బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం, పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 43.7, పశ్చిమగోదావరి జిల్లా తణుకులో 43.6, కృష్ణా జిల్లా కంకిపాడులో 43.4, ప్రకాశం జిల్లా కొండపిలో 43, ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడులో, నెల్లూరు జిల్లా గూడూరులో 44 డిగ్రీలు, కృష్ణా జిల్లా పెదపారుపూడి, పల్నాడు జిల్లా అమరావతిలో 43.4, కంచికచర్లలో 43.2, గుంటూరు జిల్లా రాయపూడిలో 43, ప్రకాశం జిల్లా చీమకుర్తిలో 42.7, తిరుపతి జిల్లా బోనుపల్లెలో 42.4, విజయనగరం జిల్లా రాజాంలో 42.3, ఏలూరు జిల్లా కలపర్రులో 42.3, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం, తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం, ఏలూరు జిల్లా అల్లిపల్లి, పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం, విజయనగరం జిల్లా దత్తిరాజేరులో 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి' అని వెల్లడించింది.

## దేశానికి యువతే ప్రాణం

### - యువతను తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటా

### - ఎక్స్ వేదికగా పవన్ కళ్యాణ్ వెల్లడి

ఆమరావతి– సూర్యవాస్తవం

తన రాజకీయ ప్రయాణంలో యువత పాత్రను ప్రత్యేకంగా స్మరించుకుంటూ జనసేన అధినేత పవన్ కల్యాణ్.. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. 2008లో ప్రజారాజ్యం పార్టీ(పీఆర్‌పీ) యువజన విభాగం 'యువరాజ్యం' కోసం పటిష్ఠమైన యువజన విభాగం నిర్మించాలని ప్రణాళిక చేశానని తెలిపారు. జనసేన పార్టీని స్థాపించి 12 ఏళ్లలో ఎన్నో కష్టాలు, పోరాటాలను అధిగమించిన తర్వాత.. పార్టీ కార్యకర్తలు ఇప్పుడు అనుభవం, పరిణితితో నిండి, సంస్థాగత బాధ్యతలు చేపట్టడానికి, రాజకీయాలు నిర్వహించడానికి, ప్రజా సమస్యలు పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ యువరాజ్యం యువజన విభాగానికి పవన్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. 2005 నుంచి ఇప్పటి వరకు తనను విశ్వసించి అండగా నిలిచిన యువతకు పవన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నిజాయితీ, నిబద్ధత, దేశభక్తి కలిగిన యువతను, చైతన్యవంతమైన నాయకులను తీర్చిదిద్దేందుకు తాను కృషి చేస్తానని పవన్ ప్రతిజ్ఞ చేశారు. నూతన భారత్.. జెన్‌జెడ్ తరం నుంచి అద్భుతమైన నాయకుల ఆవిర్భావానికి సాక్ష్యంగా నిలుస్తుందన్నారు. జెన్‌జెడ్ తరం.. బుజ్జగింపు రాజకీయాలు, వంశపారంపర్య రాజకీయాలు, కుల రాజకీయాలు, విభజన రాజకీయాలు, ప్రాంతీయ రాజకీయాలతో విసిగిపోయిందని అభిప్రాయపడ్డారు. ఈ తరం.. జవాబుదారీతనం గల రాజకీయాలను తీసుకురాగల నాయకుల కోసం ఎదురుచూస్తోందని చెప్పారు. అంతేగానీ, ప్రపంచ వేదికలపై భారత్‌ను బలహీనపరిచే నాయకుల కోసం కాదన్నారు. బలమైన, పటిష్ఠమైన భారత్‌ను నిర్మించగల నాయకుల కోసం జెన్‌జెడ్ యువత ఎదురుచూస్తోందని ఎక్స్ ఖాతాలో పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు.

# అవయవ మార్పిడి చట్టానికి ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

వివరించారు.

**అమరావతికి ఐకానిక్‌గా 'అమరావతి ఐ'**

లండన్, దుబాయ్ నగరాల్లోని ఐకానిక్ నిర్మాణాల తరహాలో, కృష్ణా నది ఒడ్డున ఆరు ఎకరాల విస్తీర్ణంలో 'అమరావతి ఐ' నిర్మాణానికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ (ఐడీఫీు) పద్ధతిలో 30 ఏళ్ల లీజు ప్రాతిపదికన ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. దీనికోసం టెండర్లు ఆహ్వానించేందుకు మంత్రివర్గం అనుమతి ఇచ్చింది. ఈ ప్రాజెక్టు ద్వారా అమరావతి, కృష్ణా నది అందాలను పర్యాటకులు వీక్షించేందుకు వీలు కలుగుతుందని, ఇది ప్రపంచ పర్యాటక పటంలో అమరావతికి ప్రత్యేక స్థానం కల్పిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

**రాజధాని నిర్మాణ పనులకు ఊతం**

అమరావతిలో నిర్మాణ పనులను వేగవంతం చేసే దిశగా కేబినెట్ పలు నిర్ణయాలు తీసుకుంది. హైకోర్టు భవనం బాహ్య సుందరీకరణ పనుల కోసం రూ. 547 కోట్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. అదేవిధంగా, ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులు, ప్రిన్సిపల్ సెక్రటరీల నివాస భవనాల్లో హోమ్ ఆటోమేషన్, ఇతర ఆధునిక సౌకర్యాల కల్పన కోసం రూ. 94.90 కోట్ల పనులకు ఆమోదం తెలిపింది. రాజధానిలో అంతర్జాతీయ స్థాయి కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం కోసం ఏపీఐఐసీకి ఎనిమిది ఎకరాల భూమి కేటాయింపును నిర్ధారించారు. రానున్న 9-10 నెలల్లో దీని నిర్మాణం పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**గ్రామీణ ఉపాధికి 125 రోజుల గ్యారెంటీ**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ గ్రామీణ్' పథకాన్ని రాష్ట్రంలో అమలు చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. జూలై 1, 2026 నుంచి ఈ పథకం అమలులోకి వస్తుంది. దీని కింద ప్రస్తుతం ఉన్న 100 రోజుల ఉపాధి హామీని 125 రోజులకు పెంచారు. దీనివల్ల ప్రతి గ్రామీణ కుటుంబానికి అదనంగా ఏటా రూ. 7,675 లబ్ధి చేకూరుతుంది. ఈ పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులు సమకూ రుస్తాయి. అంతేకాకుండా, కూలీలకు 15 రోజుల్లోగా వేతనాలు చెల్లించాలని, ఆలస్యమైతే రోజుకు 0.05% చొప్పున వడ్డీ చెల్లించాలని నిబంధన విధించడం గమనార్హం.

**కొత్త పాలసీలతో ప్రగతి పథం**

విమానయాన పాలసీ: రాష్ట్ర విమానయాన రంగంలో భారీ లక్ష్యాలతో కొత్త పాలసీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. 2035 నాటికి ప్యాసింజర్ మార్కెట్ షేర్‌ను 4 శాతానికి, ఎయిర్ కార్గో మార్కెట్ షేర్‌ను 5 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కొత్త విమానాశ్రయాలు, వాటర్ డ్రోమ్‌ల ఏర్పాటు, ఏరోస్పేస్ తయారీలో పెట్టుబడులను ఆకర్షించడం ఈ పాలసీ ముఖ్య ఉద్దేశాలు.

**బీచ్ షాక్ పాలసీ:** రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు గోవా, ఒరిస్సా తరహాలో బీచ్ షాక్‌ల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పైలట్ ప్రాజెక్ట్‌గా తొలి దశలో చీరాలలోని సూర్యలంక, విశాఖపట్నం బీచ్‌లలో రెండేసి చొప్పున షాక్‌లను ఏర్పాటు చేస్తారు.

**అవయవదాన చట్టం:** అవయవదానం, అవయవ మార్పిడి కార్యకలాపాలను నియంత్రించేందుకు కేంద్రం తీసుకొచ్చిన 'ది ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూస్ యాక్ట్-2011'ను రాష్ట్రంలో అమలు చేసేందుకు కేబినెట్ నిర్ణయించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు, అవయవాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఈ చట్టాన్ని ఆర్డినెన్స్ రూపంలో తీసుకురానున్నారు.

**వ్యవసాయం, పరిశ్రమలకు చేయూత**

పోలవరం ఎడమ ప్రధాన కాలువ ప్యాకేజీ 5, 5ఎ పనులకు సంబంధించి అంచనా వ్యయాన్ని రూ. 352.6 కోట్ల నుంచి రూ. 796.66 కోట్లకు సవరిస్తూ కేబినెట్ పరిపాలన అనుమతులు ఇచ్చింది. అగ్రిగోల్డ్ కేసుల సత్వర పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టుకు 21 పోస్టులను మంజూరు చేసింది. ఈ కేసుల పరిష్కారానికి మంత్రులతో ఒక సబ్ కమిటీని కూడా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటు కోసం నెడ్‌క్యాప్ ద్వారా పలు కంపెనీలకు భూములు లీజుకు ఇచ్చే ప్రతిపాదనలకు కూడా ఆమోదం లభించింది.

**ఇతర కీలక నిర్ణయాలు**

శ్రీ సిటీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ: తిరుపతి జిల్లా శ్రీ సిటీలో కొత్త ప్రైవేట్ యూనివర్సిటీ ఏర్పాటుకు వీలుగా ఏపీ ప్రైవేట్ యూనివర్సిటీ యాక్ట్-2016 సవరణకు ఆర్డినెన్స్ జారీకి ఆమోదం.

**అంతర్జాతీయ యోగా దినోత్సవం:** జూన్ 7 నుంచి 21 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించేందుకు రూ.10 కోట్లు మంజూరు.

భూముల రీ-క్లాసిఫికేషన్: గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు గ్రామంలోని 25 ఎకరాల 'ట్యాంక్ పోరంబోకు' భూమిని 'గ్రామ కంఠం'గా మార్చేందుకు నిర్ణయం. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి సమస్యలను పరిష్కరించాలని సీఎం ఆదేశించారు.

**టీడీపీ కార్యాలయాలకు భూమి:** అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో తెలుగుదేశం పార్టీ కార్యాలయాల నిర్మాణానికి 66 ఏళ్ల లీజు ప్రాతిపదికన భూమి కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

మొత్తంమీద, ఈ కేబినెట్ సమావేశం రాజధాని అమరావతి నిర్మాణాన్ని పరుగులు పెట్టించడం, పర్యాటక రంగానికి కొత్త ఊపునివ్వడం, గ్రామీణ ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించడం, పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేయడం వంటి బహుముఖ లక్ష్యాలతో సాగింది. ఈ నిర్ణయాలు రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రగతిపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతాయని ప్రభుత్వం విశ్వాసం వ్యక్తం చేస్తోంది.



## తెలంగాణను అస్థిరపరిచే రాజకీయాలకు నేను వ్యతిరేకం

### - డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

### - జూన్ 2న చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగడంతో వివరణ

### - పరస్పర గౌరవంతో ముందుకెళ్లడమే తన విధానమంటూ స్పష్టీకరణ

### - ఎక్స్ వేదికగా పోస్ట్.. గతంలోని వీడియోను పంచుకున్న జనసేనాని

ఆమరావతి– సూర్యవాస్తవం

తెలంగాణను అస్థిరపరిచే రాజకీయాలకు తాను ఎన్నడూ మద్దతు ఇవ్వలేదని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పరస్పర గౌరవం, శాంతి, సహకారంతో రెండు తెలుగు రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడాలన్నదే తన అభిమతమని ఆయన తేల్చిచెప్పారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తాను చేసిన వ్యాఖ్యలపై నెలకొన్న వివాదంపై ఆయన గురువారం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షల పట్ల తన వైఖరి రాష్ట్ర విభజన నాటి నుంచి ఇప్పటివరకూ మారలేదని పేర్కొన్నారు. విభజన తర్వాత తాను 'సెక్షన్ 8' అమలును వ్యతిరేకించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఇది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, స్వయంపాలనా హక్కును దెబ్బతీస్తుందనే భావనతోనే ఆనాడు ఆ విధంగా స్పందించానని వివరించారు. ఇరు రాష్ట్రాల మధ్య విశ్వాసాన్ని పెంపొందించే యంత్రాంగాలు ఉండాలని తాను సూచించినట్లు తెలిపారు. తన పూర్వ వైఖరిని ధ్రువీకరించే పాత వీడియో క్లిప్‌ను కూడా ఆయన ఈ పోస్టుకు జతచేశారు. గతంలో జూన్ 2న గచ్చిబౌలిలో జనసేన సభకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో, పవన్ కల్యాణ్ తన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించిన సంగతి తెలిసిందే. ఆ సందర్భంగా, తెలంగాణలో 2029 అసెంబ్లీ ఎన్నికలతో పాటు జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లోనూ జనసేన పోటీ చేస్తుందని ఆయన ప్రకటించారు. అయితే, 'అతివాద ప్రాంతీయత'పై ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా పెను దుమారం రేపాయి. పవన్ వ్యాఖ్యలపై తెలంగాణ అధికార పక్షమైన కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. మంత్రి పొన్నం ప్రభాకర్ సహా పలువురు నేతలు స్పందిస్తూ.. సుదీర్ఘ ఉద్యమాల ద్వారా సాధించుకున్న తెలంగాణలో ఇక్కడి వ్యవహారాల్లో ఇతరుల జోక్యం తగదని హితవు పలికారు. ఈ రాజకీయ పరిణామాల నేపథ్యంలోనే పవన్ కల్యాణ్ తాజాగా వివరణ ఇచ్చారు.



## ఏపీకి పెట్టుబడులే లక్ష్యం

### - రష్యా వేదికగా లోకేష్ ప్రసంగం

### - రష్యాలో జరిగిన అంతర్జాతీయ ఆర్థిక ఫోరంలో మంత్రి లోకేశ్ ప్రసంగం

### - పెట్టుబడిదారులుగా కాకుండా భాగస్వాములుగా ఏపీకి రావాలని ఆహ్వానం

### - 2047 నాటికి ఏపీని 2.5 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామన్న లోకేశ్

### - 2030 నాటికి 100 బిలియన్ డాలర్ల భారత్-రష్యా ద్వైపాక్షిక వాణిజ్యమే లక్ష్యం

### - ఏపీలో స్పేస్, ఏరోస్పేస్, సెమీకండక్టర్ల రంగాల్లో పెట్టుబడులపై దృష్టి

అమరావతి – సూర్య వాస్తవం



రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ ఆర్థిక ఫోరం వేదికగా ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రసంగించారు. కేవలం పెట్టుబడిదారులుగానే కాకుండా, రాష్ట్ర అభివృద్ధిలో దీర్ఘకాలిక భాగస్వాములుగా పాలుపంచుకోవాలని రష్యా పారిశ్రామికవేత్తలను, దిగ్గజ సంస్థలను ఆయన సాదరంగా ఆహ్వానించారు. భారత్-రష్యాల మధ్య బంధం కేవలం వ్యాపార ఒప్పందాలకే పరిమితం కాదని, అది ఒక దృఢమైన అనుబంధమని లోకేష్ పేర్కొన్నారు. భిలాయ్ స్టీల్ ప్లాంట్ నుంచి గగన్‌యాన్ ప్రాజెక్టు వరకు అనేక కీలక సందర్భాల్లో రష్యా భారత్‌కు అండగా నిలిచిందని ఆయన గుర్తుచేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నిర్దేశించుకున్న 2030 నాటికి 100 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్య లక్ష్యాన్ని చేరుకోవడంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషించనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, 2047 నాటికి రాష్ట్ర జీడీపీని 2.5 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యమని వివరించారు. వెయ్యి కిలోమీటర్ల మేర విస్తరించిన సుదీర్ఘ తీరప్రాంతం, ఆరు ప్రధాన ఓడరేవులు, పటిష్టమైన మౌలిక సదుపాయాలు, నిరంతరాయ విద్యుత్ సరఫరా వంటి అంశాలు రాష్ట్రంలో పెట్టుబడులకు ఎంతో అనువైనవని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు. అంతరిక్ష రంగంలో ఇరు దేశాల మధ్య సహకారం నూతన శిఖరాలకు చేరుతోందని, భారత దేశపు ఏకైక స్పేస్‌పోర్ట్ శ్రీహరికోట ఆంధ్రప్రదేశ్‌లోనే ఉందని లోకేష్ గుర్తుచేశారు. ఈ క్రమంలో రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న 'స్పేస్ సిటీల'లో పెట్టుబడులు పెట్టాలని 'రోస్‌కోస్మోస్' వంటి ప్రతిష్టాత్మక సంస్థలను ఆహ్వానించారు. ఏరోస్పేస్, సెమీకండక్టర్లు, ఇంధన రంగాల్లో రష్యన్ సంస్థలకు అపారమైన అవకాశాలు ఉన్నాయని, ఉమ్మడిగా ఉజ్వల భవిష్యత్తును నిర్మిద్దామని

## సంపాదకీయం

# తెలంగాణలో సెంటిమెంట్ రాజకీయం !




తెలంగాణను ముంచిన వారంతా ఇప్పుడు వీరతాళ్లు వేసుకుని..నా తెలంగాణ అంటూ ఊరేగుతున్నారు. విగ్రహాల పేరుతో కొందరు నిగ్రహం కోల్పోయి మాట్లాడుతున్నారు. తెలంగాణ అస్తిత్వం ప్రమాదంలో పడ్డదని వాపోతున్నారు. ఇప్పుడు తెలంగాణ సెంటిమెంట్ కోసం మళ్లీ రాజకీయ రగడ మొదలయ్యింది. ఎవరికి వారు తామే తెలంగాణ భావి విధాతలమని మాట్లాడుతున్నారు. పవన్ కళ్యాణ్‌ను బూచిగా చూపి ఎవరికి తోచినట్లు వారు మాట్లాడుతున్నారు. నిజానికి తెలంగాణ ఏర్పడ్డ తరవాత జరిగిన ద్రోహం, అంతకుముందు ఎప్పుడూ జరగలేదు. ఉమ్మడి ఎపిలో జరగనంత దోపిడీ గత 12 ఏళ్లుగా సాగుతోంది. ఎక్కడిక్కడ భూములు దోచుకున్నారు. అప్పుల చేసి దోచుకున్నారు. తెలంగాణను అప్పుసుల కుప్పచేసి అనుభవిస్తున్నారు. ఎవరికి వారు తామే తెలంగాణను ఉద్ధరించామని చెప్పుకుంటున్నారు. నిరుద్యోగ సమస్య తీరలేదు. నీటి సమస్యలు తీరలేదు. నిధులు పారించలేదు. అంతెందుకు రైతులు పండించిన ధాన్యం మద్దతు ధరలకు కొని సేకరణ సక్రమంగా చేయడంలో కూడా విఫలం అయ్యారు. మక్క, జొన్న, మిర్చి, పత్తి రైతులు ఏటా పడుతున్న కష్టాలను పట్టించుకోని అసమర్థులుగా మిగిలి పోయారు. ఇకపోతే తెలంగాణలో కొత్తగా ఆస్తులు సృష్టించలేదు. అయినా పాలకులుగా పనిచేసిన వారు తామే తెలంగాణను ఉద్ధరించామని ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. ప్రజలకు పెన్షన్లు, ఇళ్లు, ఆరోగ్యశ్రీలు ఎరగా వేసి దర్జాగా దోచేస్తున్నారు. నిజానికి ఉమ్మడి ఎపి నుంచి తెలంగాణ విడివడ్డాక తెలంగాణ అభివృద్ధి చెందిందా..లేక అప్పుల పాలయ్యిందా అంటే..అప్పుల పాలయ్యిందని లెక్కలు చెబుతున్నాయి. సమయానికి జీతాలు ఇవ్వలేని వారు పాలకులు అయ్యారు. హైదరాబాద్ మీ అయ్య జాగీరా అని జనసేనాని పవన్ కళ్యాణ్ అనగానే కొందరు ఒంటి కాలిపై లేచి..అవును మా అయ్య జాగీరే అంటున్నారు. ఎందుకంటే మూడో వ్యక్తి వస్తే..దోచుకోవడానికి అవకాశం ఉండదు కనుక...ఎగిరెగిరి పడుతున్నారు. తెలంగాణ సమాజాన్ని బెదిరిస్తున్నావంటూ పవన్‌ను చీల్చి చెండాడేంత పని చేశారు. పవన్ మీడియా సమావేశంలో మాట్లాడిన మాటలు నిజంగానే తెలంగాణలోని కొందరికి బాధ కలిగించాయి. అందులో అనుమానం లేదు. రాజకీయంగా తెలంగాణలో ఉన్న కొందరు జనసేనలోనూ ఉన్నారు. వారికి పదవులు రావాలంటే జనసేన పక్షాన పోటీ చేయాల్సిందే. రాజకీయ పార్టీ అన్న తరవాత పోటీకి సై అంటుంది. జనసేన కూడా అదే చేసింది. అయితే మిగతా ప్రాంతాలకు, తెలంగాణకు ఓ రేఖ అడ్డంగా ఉంది. అదే సెంటిమెంట్. తెలంగాణ ప్రజలను ముంచిందే సెంటిమెంట్. ఆ సెంటిమెంట్‌తోనే ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డది. అది అడ్డం పెట్టుకునే కెసిఆర్ కుటుంబం పదేళ్లు దర్జాగా తెలంగాణలో పాగా వేసి, ఇష్టారాజ్యంగా దోచుకున్నది. పదవులు, డబ్బులు, భూములు దోచేసారు. లక్షల కోట్లు తెలంగాణ నెత్తిన అప్పులు పెట్టారు. తరవాత గత రెండేళ్లుగా కాంగ్రెస్ కూడా అదే దారిలో నడుస్తోంది. అభివృద్ధి పేరిట ఊదరగొట్టిన కాంగ్రెస్ నేతలు పప్పు బెల్లాల్లా తెలంగాణను పంచుకుంటున్నారు. భూములు యధేచ్ఛగా అమ్మేస్తున్నారు. ఈ క్రమంలో పవన్ రాకతో మరోమారు సెటిమెంట్ రగిల్చి బాగుపడాలన్న ధోరణిలో పొన్నం ప్రభాకర్, కెటిఆర్, కవితలు తామే అసలుసిసలు తెలంగాణ వారుసులమని చెప్పుకునే ప్రయత్నంలో పడ్డారు. తెలంగాణ సమాజం అస్తిత్వ సంక్షోభంల పడుతున్నదనీ గొంతు చించుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మరోసారి ఆంధ్రా ఆధిపత్యం కిందకు వెళుతోందని ప్రకటించుకున్నారు. పవన్ కళ్యాణ్ ఎంట్రీ వెనక బిజెపి, మోడీ ఉన్నారని ఆరోపిస్తున్నారు. తెలంగాణ కూడా భారతదేశంలోనే ఉందని, అందుకు బిజెపి ఎక్కడైనా పావులు కదుపుతుందని తెలుసుకోవాలి. బిజెపికి తెలంగాణ కూడా ఒక రాష్ట్రమని తెలుసు. ఇక్కడ పాగా వేయాలని ఎప్పటనుంచో కలలు కంటోంది. కనుక దాని ప్రయత్నాల్లో అది ఉంది. ఇది రాజకీయం. కెసిఆర్ కూడా భారత రాష్ట్ర సమితి అంటూ దేశాన్ని ఏలుతానని అన్ని రాష్ట్రాలు తిరిగారు. దానిని ఎవరైనా తప్పుపట్టారా అన్నది కెటిఆర్ చెప్పాలి. రాజకీయ పార్టీ పెట్టి ఇక్కడ వైఎస్ షర్మిల కూడా పాదయాత్ర చేశారు. తాను తెలంగాణ బిడ్డనని ప్రకటించుకున్నారు. అప్పుడు లేని రోషం ఇప్పుడే ఎందుకు వచ్చిందన్నది ప్రశ్న. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం స్వరాష్ట్రంలో ఆంధ్రా వలసవాదం పెరిగింది. దానికి కెసిఆర్ ఆద్యులు. ఆయనే మాకు ఆంధ్రాతో పేచీ లేదంటూ..జగన్‌ను పిలిచి భోజనం పెట్టి అలయ్ భలయ్ చేసుకున్నారు. కృష్ణా నీటిని ఎపికి దోచి పెట్టారని వస్తున్న ఆరోపణలకు కెసిఆర్ బృందం నుంచి సమాధానం లేదు. తెలంగాణలో అధికారాన్ని చేజిక్కించుకుని, హైదరాబాద్ సంపదను కొల్లగొట్టడానికి వస్తున్నారని జనసేనాని పవన్ కళ్యాణ్‌ను విమర్శించే ముందు..ఇక్కడ ఎంత కొల్లగొట్టారో చెప్పాలి. ధరణి పేరుతో మోసాలు. కాళేశ్వరం పేరుతో దగా. టెలిఫోన్ ట్యాపింగ్. అస్మదీయులకు రాజ్యసభ పదవులు.. ఇలా చెప్పకుంటూ పోతే కథలు కోకొల్లలు. ఇప్పుడు రెండేళ్ల పాలనలో మంత్రులందరిపైనా అవినీతి గుప్పు మంటోంది. అయినా ఎవ్వరు కూడా మాట్లాడడం లేదు. తెలంగాణ మేధావులు నోరు మెదపడం లేదు. కాంగ్రెస్ వచ్చాకనే స్వేచ్ఛ వచ్చిందని కోదండరామ్ సార్ అంటున్నారు. అంటే కెసిఆర్ ఉన్నంతకాలం నిరంకుశ పాలనలో మగ్గామనే అర్థం కదా. తెలంగాణ అస్తిత్వం మీద దాడిలో, మోదీ, చంద్రబాబుల ఉమ్మడి ప్రణాళిక దాగి ఉందని ఘోషిస్తున్న వారు, ఏ రకమైన దాడి జరిగిందో చెప్పాలి. ఈ గడ్డపై నివస్తిస్తూ ఇక్కడే మమేకమైన వారంతా తెలంగాణ బిడ్డలే. వాళ్ల పిల్లల భవిష్యత్తు, వారి ఉద్యోగాలు, వ్యాపారాలు అన్నీ ఈ తెలంగాణ రాష్ట్రంతోనే ముడిపడి ఉన్నాయి. రాజకీయ పార్టీలు అన్ని చోట్లా తమ అస్తిత్వం కోసం ప్రయత్నం చేస్తుంటాయి. కెసిఆర్ కుటుంబానికి చెందిన పార్టీలే తెలంగాణకు ప్రతినిధులు కాదు. తెలంగాణ కోసం కష్టపడే వారు ఎవరైనా రాజకీయలు చేసుకునే హక్కు ఉంటుంది. రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో, ఆ తర్వాత జరిగే సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి పోటీ చేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీనిని తప్పుపట్టడానికి లేదు. ఉమ్మడి రాష్ట్రంలో అధికారం చలాయించిన సమైక్య పాలకులు, తెలంగాణ ఏర్పాటుతో అధికారం చేపట్టిన వారు కూడా తెలంగాణను నిలువునా దోచుకున్నారు. కాబట్టి ఎవ్వరు కూడా తెలంగాణ అస్తిత్వం కోసం పోరాడలేదు. తమ స్వార్థ రాజకీయం కోసమే పోరాడారు. ఇంకా పోరాడుతున్నారు. ఇప్పుడు రాష్ట్ర విభజన జరిగిన తర్వాత కూడా ఇదే సెంటిమెంటుతో తమ ఉనికి కోసం కొందరు ఇప్పుడు నానా యాగీ చేస్తున్నారని గుర్తిస్తే మంచిది.




# గందరగోళం అధ్యాపకుల నియామకాల నోటిఫికేషన్

- ఓ అడుగు ముందుకు......మూడు అడుగులు వెనక్కి
- రిజర్వేషన్ వర్గాలకు శరాఘాతంగా మారనున్న నోటిఫికేషన్
- రిజిస్ట్రేషన్ వేలల్లో రుసుము వసూళ్లు...!

అనంతపురం- సూర్య వాస్తవం

ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసిన విశ్వవిద్యాలయాల పోస్టుల నోటిఫికేషన్ రానే వచ్చింది. నోటిఫికేషన్ తో పాటు గందరగోళం ఎక్కువగా ఉంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ చాలా సులభంగా ఉంది. నియామకాలు సెంట్రలైజ్డ్ పద్ధతిలో చేస్తారా లేక ఏ యూనివర్సిటీ వారు నియామకాలు చేపడతారా అన్న ప్రశ్న తలెత్తుతుంది. నియామకాలు ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు ఉంది. గతంలో విశ్వవిద్యాలయాలకు ఇచ్చిన నోటిఫికేషన్లు అన్నీ పాలకమండలి సమావేశాలు పెట్టి రద్దు చేశారు. అప్పుడు రిజిస్ట్రేషన్ రుసుము వేలకు వేలు తీసుకొని అతి గతి లేదు. కట్టిన డబ్బు వాపస్ గురించి పలుమార్లు విశ్వవిద్యాలయ అధికారులకు విన్నవించుకున్నా ప్రయోజనం లేదు. ఇప్పుడు అన్ని విశ్వవిద్యాలయాలకు ఒకే పోర్టల్ ద్వారా అప్లై చేసుకోమని వెబ్సైట్ లో పొందుపరిచారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ కు పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీనికి ఒక పోస్టుకు 2500 రూపాయలు, అసోసియేట్ ప్రొఫెస్సర్ప్, ప్రొఫెస్సర్ డైరెక్టర్ లైబ్రేరియన్ పోస్టుకు 3000. ఒక అభ్యర్థి ఐదు విశ్వవిద్యాలయాలకు అప్లై చేస్తే 15000 రూపా యలు సమర్పించుకోవాలి. పరీక్షలు ఇంటర్వ్యూ నిర్వహించే పోస్టుకు 2500 పెట్టి కేవలం ఇంటర్వ్యూ నిర్వహించే పోస్టుకు 3000 ఏ ప్రాతిపదికన పెట్టారో అర్థం కావడం లేదు. ఒకవేళ ఈ ప్రక్రియ రద్దయితే వారికి డబ్బు వాపస్ ఇస్తామన్న గ్యారంటీ లేదు. లాటరీలో అదృష్టం వెతుకుతున్నట్లు అభ్యర్థులు కూడా ఎండమావులను నమ్ముకుంటున్నారు. గతంలో కట్టిన రుసుము ఇప్పటి నోటిఫి కేషన్‌కు సర్దాలి, లేదా అప్పుడు వసూలు చేసిన డబ్బు వాపసు ఇవ్వాలి. లేదంటే అప్పటి ఉన్నత విద్య అధికారులపై తక్షణమే శాఖాపరమైన దర్యాప్తు జరిపి జైలుకు పంపాలి. 2023 లో ఇచ్చిన నోటిఫికేషన్ లో దాదాపు 2900 పోస్టులు ఉంటే ఇప్పుడు నలభై శాతం పోస్టులు కుదించి 1523 పోస్టులకు పరిమితం చేశారు. రోస్టర్ దానికి అనుగుణంగా తయారు చేశారు. గతంలో నోటిఫికేషన్ ఇప్పటి నోటిఫికేషన్ చాలా తేడా ఉంది. మరికొందరు ఇప్పటికే యాభై సంవత్సరాలు వచ్చాయి, ఇప్పుడు ఉద్యోగం చేసి వెలగబెట్టేది ఏమి ఉండదు, ఉద్యోగం వచ్చినా కలికిరి శ్రీకాకుళం విజయనగరం వెళితే జీవితంలో సాధించేది ఏమీ ఉండదని వేదాంత ధోరణితో ఉన్నారు.రిజిస్ట్రేషన్ ఫీజు వేలల్లో ఎందుకు వసూలు చేస్తున్నారు. గతంలో ఒక ఉపకులపతి ఏకంగా రిజిస్ట్రేషన్ ఫీజు 5000 పెట్టారు, ఎందుకని విద్య పరిరక్షణ కమిటీ వారు అడిగితే అప్లై చేసుకోవడానికి సీరియస్ అభ్యర్థులు వస్తారని తెలిపారు. రిజిస్ట్రేషన్ ఫీజు తక్కువ పెడితే ఎవడు పడితే వాడు అప్లై చేసుకుంటున్నారు అని ఆవేదన వెలిబుచ్చారు. కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, కంప్యూటర్ డిసైన్, యానిమేషన్, కంప్యూటర్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ ఇలా ఒక్క కంప్యూటర్ విద్య లో దాదాపు పది పోస్టులుగా వర్గీకరించారు, అన్నీ కలిపి కంప్యూటర్ సైన్స్ అని పెడితే సరిపోతుంది. కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ లో దాదాపు ఐదు వర్గీకరణలు చేశారు. నియామకాలకు బోర్డు ఏర్పాటు చేయలేదు, ఒకవేళ చేసిన విశ్వవిద్యాలయ ఉపకులపతులు ఒప్పుకోరు. ఒప్పుకుంటే గడ్డి వాము కు కుక్క ని కాపలా పెట్టినట్లు అవుతుంది. గత పదిహేను సంవత్సరాలుగా యూనివర్సిటీల లో శ్మశాన ప్రశాంతి నెలకొంది. గత ఐదు ఆరు సంవత్సరాలుగా ప్రయివేటు యూనివర్సిటీ క్యాష్ అండ్ క్యారీ పద్ధతిలో ప్రధానం చేసిన డాక్టరేట్లు సంగతి తేలలేదు. ప్రయివేటు యూనివర్సిటీలలో రీసర్చ్ సూపర్వైజర్ ఉండరు. ఆరు నెలలకు ఒకరు మారుతుంటారు. డిస్టెన్స్ మోడ్ లో, కరస్పాండెన్స్ కోర్స్ లాగా పిహెచ్డి ప్రదానం చేస్తున్నారు. గాడిద గుర్రాన్ని ఒకే గాటికి కట్టడం సరైన పద్ధతి కాదు. విద్యా సంస్థల ద్వారా రిక్రూట్‌మెంట్లలో పోస్టుల రిజర్వేషన్. ప్రస్తుతానికి అమలులో ఉన్న మరే ఇతర చట్టంలో ఏది ఉన్నప్పటికీ, పోస్టుల రిజర్వేషన్ ఉంటుంది. సెంట్రల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్‌లో టీచర్స్ కేడర్‌లో మంజూరైన బలం నుండి డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లో నోటిఫికేషన్ ద్వారా ప్రభుత్వం పేర్కొన్న మేరకు పద్ధతిలో అధికారిక గెజిట్ ఉంది. పోస్టుల రిజర్వేషన్ ప్రయోజనం కోసం, విద్యా సంస్థ ఒకటిగా పరిగణించబడుతుంది. రిజర్వేషన్ల కోసం అందించే కార్యనిర్వాహక సూచనలలో తరచుగా ఉపయోగించే “పోస్టులు”, “ఖాళీలు” అనే వ్యక్తీకరణలు సమస్యాత్మకంగా ఉంటాయి. “పోస్ట్” అనే పదానికి నియామకం, ఉద్యోగం, కార్యాలయం లేదా ఉపాధి అని అర్థం. ఒక వ్యక్తిని నియమించబడిన స్థానం. “ఖాళీ” అంటే ఖాళీ లేని పోస్ట్ లేదా ఆఫీస్. రెండు వ్యక్తీకరణల యొక్క సాదా అర్థం ‘ఖాళీ’ ఏర్పడటానికి ‘పోస్ట్’ ఉనికిలో ఉండాలని స్పష్టం చేస్తుంది. కేడర్ – బలం ఎల్లప్పుడూ కేడర్‌తో కూడిన పోస్టుల సంఖ్యతో కొలవబడుతుంది. కేడర్‌లోని ఒక పోస్ట్‌కు సంబంధించి మాత్రమే నియామకం కోసం పరిగణించబడే హక్కును క్లెయిమ్ చేయవచ్చు. పర్యవసానంగా కేడర్–బలాన్ని ఏర్పరిచే పోస్టుల సంఖ్య సంబంధించి రిజర్వేషన్ శాతాన్ని రూపొందించాల్సి ఉంటుంది. రిజర్వేషన్ల శాతాన్ని అమలు చేయడంలో ‘ఖాళీ’ భావనకు ఎలాంటి ఔచిత్యం లేదు. ప్రతి శాఖలో నిర్వహించాల్సిన రోస్టర్‌కు అనుగుణంగా నిర్బంధించబడిన ప్రభుత్వ సూచనల క్రింద అందించబడిన రిజర్వేషన్‌లు నిర్వహించబడతాయి. రోస్టర్ సంవత్సరానికి ఖాతా అమలు రూపంలో అమలు చేయబడుతుంది. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్ తెగలు వెనుకబడిన తరగతులు వారి రిజర్వ్‌డ్ పోస్టుల శాతాన్ని పొందేలా చేయడం “రన్నింగ్ అకౌంట్” యొక్క ఉద్దేశ్యం. ఇంప్డ్ చేయబడిన సూచనలలో “రన్నింగ్ అకౌంట్” అనే కాన్సెప్ట్‌ను అర్థం చేసుకోవాలి, అది అధిక రిజర్వేషన్‌కు దారితీయదు. “16% పోస్టులు షెడ్యూల్డ్ కులాలు వెనుకబడిన తరగతుల సభ్యులకు రిజర్వ్ చేయబడ్డాయి. 100 పోస్టులలో క్రమ సంఖ్యలు 1,7, 15, 22, 30, 37, 44, 51, షెడ్యూల్డ్ కులాల రోస్టర్‌లో 58, 65, 72, 80, 87 91 రిజర్వ్ చేయబడ్డాయి . రోస్టర్ పాయింట్లు 26 76 వెనుకబడిన తరగతుల సభ్యులకు రిజర్వ్ చేయబడ్డాయి. క్యాడర్‌కు రిక్రూట్‌మెంట్ ఎప్పుడు ప్రారంభమవుతుందో స్పష్టంగా తెలుస్తుంది. రోస్టర్‌లో కేటాయించిన 14 పోస్టులను షెడ్యూల్డ్ కులాల సభ్యుల నుండి భర్తీ చేయాలి. ఒక కేడర్‌లోని మొదటి పోస్ట్ తప్పనిసరిగా షెడ్యూల్డ్ కులానికి వెళ్లాలి ఆ తర్వాత పేర్కొన్న తరగతికి 7, 15, 22 తర్వాత 91వ పోస్ట్ వరకు అర్హత ఉంటుంది . ఒక కేడర్‌లోని మొత్తం పోస్టుల సంఖ్యను రోస్టర్ యొక్క ఆపరేషన్ ద్వారా భర్తీ చేసేటప్పుడు, ఇంప్యుగ్డ్ సూచనల ద్వారా ఊహించిన ఫలితం సాధించబడుతుంది. 100 పోస్టుల కేడర్‌లో రోస్టర్‌లో పోస్టులు కేటాయించినప్పుడు షెడ్యూల్డ్ కులాలు వెనుకబడిన తరగతులు రిజర్వ్డ్ కేటగిరీలకు అందించిన రిజర్వేషన్ల శాతాన్ని భర్తీ చేస్తారు. ఇప్పుడు ఇచ్చిన నోటిఫికేషన్ లో రోస్టర్ పాయింట్ సరిగా లేదు. రిజర్వేషన్ వర్గాలకు హ్యాండీక్యాప్ వర్గాలకు ఈ నోటిఫికేషన్ లో తీరని వ్యథగా మారనున్నదని డా. ముచ్చుకోట . సురేష్ బాబు తెలిపారు



## ఘనంగా డీసీయంఎస్ ఛైర్మన్ నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు



**కర్నూల్ –సూర్య వాస్తవం :** డీసీయంఎస్ చైర్మన్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు యాదవ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఎస్బీఐ కూడలి వద్ద ఉన్న అమరావతిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, బీసీ సంఘాల నాయకులు, డీసీయంఎస్ అధికారులు పాల్గొని నాగేశ్వరరావు యాదవ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలుతెలిపారు. బీసీల చిరకాల కోరిక అయినా చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వే షన్లు కల్పించాలని ఉద్యమం చేస్తున్నామన్నారు. బీసీలకు ఎంతో అండగా ఉన్న ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి నిచూసి వైసీపీ నేతలు జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని తెలిపారు. డీఎస్సీపై వైకాపా నేతలు విమర్శలు చేయడం సరికాదన్నారు. వైసీపీ కుట్ర రాజ కీయాలు మానుకోవాలని నాగేశ్వరరావు యాదవ్ కోరారు. వెంకటరమణరాజు, నక్కల మిట్ట శ్రీనివాసులు, సుజాత, మద్దిలేటి,సూగురు వెంకటే శ్వర్లు, అయ్యన్న యాదవ్, కురుమూర్తి, విజయ్, క్రిష్ణోజీ, ఉప్పరి శివన్న, లక్ష్మీ నారాయణ యాదవ్, వడ్డె బాలాజీ, పీజీ. వెంకటేష్, కురువ శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బడి పండుగ మహోత్సవం



**పులివెందుల రూరల్ – సూర్య వాస్తవం :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన బడి పండుగ మహోత్సవాన్ని జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాల, ఇస్లాంపురం పులివెందులలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్ చార్జ్ ప్రధానోపాధ్యాయులు మహ్మద్ యూనస్, ఉపాధ్యాయులు సనావుల్లాలిలు మాట్లాడుతూ మెరుగైన, నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలలలో లభిస్తున్నాయని, ఉన్నత విద్యావంతులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యాబోధనతో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, టెక్టెక్నాలజ ఐ ఎఫ్ పి బోర్డు లతో డిజిటల్ విద్యాబోధన చేస్తున్నారని, రుచికరమైన పౌష్టిక ఉచిత మధ్యాహ్న భోజనం తో పాటు ఉచిత పుస్తకాలు, నోట్‌బుక్ లు, బెల్ట్ షూ తదితర వస్తువులు అందిస్తున్నామని.., ప్రభుత్వ పాఠశాల లు ప్రగతి మార్గాలని, “ మన ఊరి బడి మనందరి గౌరవం “ అని దానిని కాపాడుకునే గురుతర బాధ్యత మనందరి పై ఉందని, ఈ సారి పదవతరగతి ఫలితాలలో 500 పై బడి మార్కులతో ఉత్తమ ఫలితాలను సాధించామని. అటువంటి ఇస్లాంపురం ఉర్దూ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని పిలుపునిచ్చారు. తర్వాత పాఠశాల ప్రగతి సూచించే పాఠశాల ప్రచార కరపత్రాలు, పోస్టర్‌లను ఎస్ఎమ్‌సి కమిటీ ఛైర్మన్, ఉపాధ్యాయ బృందం చే ఆవిష్కరించారు... ఇస్లాంపురం గ్రామంలో బడి పండుగ “ సందర్భంగా ఇంటింటికి ర్యాలీ గా పోయి విద్యార్థుల అడ్మిషన్‌లను గ్రామ ప్రజలతో, తల్లిదండ్రులతో అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లలితా, రహమతున్నీసా, సబీహ, అర్షియ, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు షాహీన్, యాస్మీన్, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు బాను, లక్ష్మీ, కళ్యాణి, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్ది’ రిలీజ్: థియేటర్ల వద్ద మెగా ఫ్యాన్స్ హంగామా!

**బెలుగుప్ప – సూర్య వాస్తవం:** గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, డైరెక్టర్ బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన ‘పెద్ది’ చిత్రం థియేటర్లలోకి వచ్చేసింది. జూన్ 3వ తేదీ రాత్రి నుంచే ప్రీమియర్ షోలు ప్రారంభం కావడంతో అభిమానుల సంబరాలు అంబరాన్ని తాకాయి.

**పండగ వాతావరణంలో సంబరాలు**

బెలుగుప్ప మండలంలోని జనసేన నాయకులు మెగా అభిమానులు సమీపంలోని కనేకల్లు, కళ్యాణదుర్గం థియేటర్ల వద్ద భారీ హంగామా సృష్టించారు. థియేటర్ల ముందు పెద్ద ఎత్తున బాణాసంచా కాలుస్తూ సందడి చేశారు. రామ్ చరణ్ కెరీర్‌లో ఇది మైల్‌స్టోన్ మూవీ కావాలని కేకులు కట్ చేసి అభిమానం చాటుకున్నారు. జై చరణ్.జై చిరంజీవ.జై కళ్యాణ్ బాబు” అంటూ అభిమానులు చేసిన నినాదాలతో థియేటర్ల పరిసరాలు మారుమోగిపోయాయి. రికార్డులు క్రియేట్ చేయడం ఖాయం! మగధీర, రంగస్థలం, సినిమాల తరహాలోనే ‘పెద్ది’ సినిమా కూడా రామ్ చరణ్ కెరీర్‌లో వన్ ఆఫ్ ది బిగ్గెస్ట్ హిట్‌గా నిలు స్తుంది. తెలుగు సినీ పరిశ్రమలోనే ఈ సినిమా సరికొత్త రికార్డులు సృష్టిస్తుంది. మెగా అభిమానులు ధీమా వ్యక్తం చేశారు. థియేటర్ల వద్ద భారీ రష్ పెద్ది సినిమా క్రేజ్‌తో థియేటర్లన్నీ మెగా అభిమానులు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, మరియు సాధారణ సినీ ప్రేక్షకులతో కిక్కిరిసిపోయాయి. ఎక్కడ చూసినా ఒక పండగ వాతావరణం కనిపిస్తోంది.




## అప్పేచెర్ల-క్రిష్టపాడు మధ్య ఎన్‌ఎచ్ 67

# రహదారిపై వరుస ప్రమాదాలు

### - ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు

**పెద్దవడుగూరు – సూర్య వాస్తవం :** మండల పరిధిలోని ఎన్ ఎచ్ 67 (అప్పేచెర్ల – క్రిష్టపాడు) మధ్య వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై పోలీసులు, రవాణా శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రమాదాల నివా రణే ధ్యేయంగా క్షేత్రస్థాయిలో ఉమ్మడి తనిఖీలు చేపట్టారు.

**ప్రమాద స్థలాల పరిశీలన**

ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న బ్లాక్ స్పాట్స్‌ను మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజాబాబు, స్థానిక ఎస్సై ఆంజనేయులు, ఆర్ డబి జేఈ కోటీశ్వర్ రెడ్డి కలిసి గురువారం నాడు పరిశీలించారు. ప్రమా దాలకు గల కారణాలను, రహదారి మలుపులను వారు క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. వాహనదారులను అప్రమత్తం చేయడానికి వేగాన్ని నియంత్రించడానికి నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులకు పలు సూచనలు చేసినట్లు అధికారులు తెలిపారు. మలుపులు, ప్రమాదకం మైన ప్రాంతాల వద్ద రేడియం షైన్ బోర్డులను ఏర్పాటు చేయడం. వాహనాల వేగాన్ని నియం త్రించేందుకు నిర్దేశిత స్పీడ్ లిమిట్ బోర్డులను అమర్చడం. ప్రమాద పీడిత ప్రాంతాల (ఆక్సిడెంట్ జోన్స్ ) గురించి వాహనదారులకు ముందే తెలిసేలా బోర్డులు పెట్టడం. నేషనల్ హైవే అథారిటీ సహకారంతో త్వరలోనే ఇక్కడ అవసరమైన రక్షణ చర్యలు చేపడతాం. ఈ మార్పుల ద్వారా అప్పేచెర్ల – క్రిష్టపాడు మధ్య ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చని ఆశిస్తున్నాం. వాహనదారులు కూడా రహదారి నిబంధనలు పాటించి, పరిమిత వేగంతో ప్రయాణించి పోలీసులకు, రవాణా శాఖకు సహకరించాలని ఈ సందర్భంగా అధికారులు విజ్ఞప్తి చేశారు.



# తాగునీటి కోసం నగర ప్రజల కష్టాలు

### - వంకలపాలవుతున్న అనంత నగర తాగునీరు
### - పట్టించుకోని అధికారులు

**కూడేరు– సూర్య వాస్తవం :** మండలంలో యథేచ్ఛగా పైప్‌లైన్ లీకేజీలు అరవకూరు, గొట్కూరు, కమ్మూరు పరిధిలో వృథాగా పోతున్న శుద్ధి చేసిన నీరు కలుషిత నీరు సరఫరా అయ్యే ప్రమాదం.. ఆందోళనలో ప్రజలు పీఏబీఆర్ డ్యాం నుంచి అనంతపురం నగరానికి దాహార్తిని తీర్చేందుకు సరఫరా అవుతున్న తాగునీరు కూడేరు మండలంలోని పలు ప్రాంతాల్లో వృథాగా వంకలపాలవు తోంది. పైప్‌లైన్ల నిర్వహణ లోపం, అధికారుల పర్యవేక్షణా రాహిత్యం కారణంగా విలువైన, శుద్ధి చేసిన తాగునీరు నేలపాలవుతుండటం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



**కలుషితమవుతున్న తాగునీరు**

మండలంలోని అరవకూరు, గొట్కూరు, కమ్మూరు తదితర గ్రామాల సమీపంలో ప్రధాన పైప్‌లైన్లకు భారీగా లీకేజీలు ఏర్పడ్డాయి. దీనివల్ల ప్రెజర్‌తో నీరు బయటకు వచ్చి వృథాగా వంకల్లోకి వెళ్తోంది. ఇంతవరకు బాగానే ఉన్నా, నీటి సరఫరా ఆగిన సమయంలో అదే లీకేజీల ద్వారా బయట ఉన్న మురుగు మరియు కలుషిత నీరు పైప్‌లైన్లలోకి చేరే ప్రమాదం ఉంది. ఇదే నీరు అనంతపురం నగర ప్రజలకు సరఫరా అయితే రోగాల బారిన పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**పట్టించుకోని నగరపాలక సంస్థ**

ఈ లీకేజీల వ్యవహారంపై స్థానిక ప్రజలు, ప్రయాణికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రోజుకు వేల లీటర్ల శుద్ధి చేసిన నీరు వృథా అవుతున్నా, అనంతపురం నగరపాలక సంస్థ (మున్సిపల్ కార్పొరేషన్) అధికారులు మాత్రం ఇటువైపు కన్నెత్తి చూడటం లేదనే వాదనలు బలంగా వినవస్తున్నాయి. ఇప్పటికైనా అనంతపురం నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు మరియు వాటర్ గ్రిడ్ సిబ్బంది తక్షణమే స్పందించి, యుద్ధ ప్రాతిపదికన కూడేరు మండల పరిధిలోని లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలి. విలువైన తాగునీరు వృథా కాకుండా, కలుషితం కాకుండా చూడాలి.

## సంక్షేమం - అభివృద్ధి -సుపరిపాలనతో

# ప్రజా పాలనకు రెండేళ్లు

### - నామా వేమ కుమార్



**వేంపల్లె – సూర్య వాస్తవం:** రాష్ట్రంలో 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం సంక్షేమం, అభి వృద్ధి, సుపరిపాలనకు పెద్దపీట వేస్తూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని వేంపల్లి పట్టణ అధ్యక్షులు నామా వేమ కుమార్ తెలిపారు. ఆయన మాట్లా డుతూ, తల్లికి వందనం పథకం ద్వారా కుటుంబంలో ఉన్న ప్రతి విద్యార్థికి రూ.15 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే అన్నదాత సుఖీభవ పథకం కింద కేంద్ర ప్రభుత్వ సహకారంతో కలిపి ప్రతి రైతు కుటుంబానికి సంవత్సరానికి రూ.20 వేల ఆర్థిక మద్దతు అందజేస్తున్నట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం, వృద్ధాప్య పెన్షన్‌ను రూ.4 వేలకూ, వికలాంగుల పెన్షన్‌ను రూ.6 వేలకూ పెంచడం ద్వారా ప్రజలకు భరోసా కల్పించినట్లు పేర్కొన్నారు. అలాగే దీపం పథకం కింద ప్రతి ఏడాది మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ జరుగుతోందన్నారు. పేద ప్రజలు, కూలీల కోసం అన్నా క్యాంటీన్లను పునఃప్రారంభించి కేవలం రూ.5కే నాణ్యమైన భోజనం అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, ఉపాధి అవకాశాలను పెంచడం లక్ష్యంగా రాజధాని అమరావతి పునర్నిర్మా ణం, పోలవరం ప్రాజెక్టు వేగవంతం, పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. టాటా గ్రూప్ విస్తరణ, రిలయన్స్ బయో--ఎనర్జీ, గూగుల్ డేటా సెంటర్, అదానీ గ్రూప్ ప్రాజెక్టులు, ఆర్సెలర్ మిట్టల్ -- నిప్పన్ స్టీల్ వంటి బహుళజాతి సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజా శ్రేయస్సు, సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం మరిన్ని కార్యక్రమాలను అమలు చేస్తూ ముందుకు సాగుతుందని నామా వేమ కుమార్ అన్నారు.

## కూటమి నేతల అబద్ధపు హామీలు

### - హామీల ఉల్లంఘనే ధ్యేయంగా పాలన



**లింగాల – సూర్య వాస్తవం:** లింగాల మండలంలి నందు, చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన నేపథ్యంగా, రెండేళ్లు పూర్తైన సందర్భంగా గురువారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో“వెన్నుపోటుకు రెండేళ్లు”కార్యక్రమం పెద్ద ఎత్తున వైసిపి నాయకుల, కార్యకర్తలు ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ మేనిఫెస్టో మరియు “సూపర్ సిక్స్” హామీల ప్రతులను దహనం చేసి నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా వై సి పి నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, హామీల ఉల్లంఘనే ధ్యేయంగా ప్రజలను వంచించిందంటూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) తీవ్ర నిరసన వ్యక్తం చేసారు. అధికారంలోకి రావడానికి ముందు కుర్చీ కోసం అడ్డగోలు హామీలు ఇచ్చి,నేడు రెండేళ్ల పాలన ముగిసినా ప్రజలపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఏవి? అన్నదాతలకు ఇచ్చిన భరోసా ఏది? అని వారు ప్రభుత్వాన్ని నిలదీశారు. నాడు నమ్మించి ఓట్లేయించుకుని,నేడు అడుగడుగునా మోసాలు చేస్తూ ప్రజల కళ్లల్లో కన్నీళ్లు తెప్పిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేరు వింటేనే ప్రస్తుత అధికార కూటమి నాయకులకు రాత్రి పూట నిద్ర కూడా పట్టడం లేదని వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్రస్థాయిలో విమర్శించారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో లింగాల మండల వైసీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.


# ఇండ్ల ముందు గుంతలు తీసి నెలలు గడుస్తున్నా
# కాలువలు, రోడ్లు వేయడం మారిచారా కమిషనర్‌శ్రీ

- సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కీ శ్రీకాంత్ ప్రశ్న
- రెండోవ రోజు సీపీఎం ఆధ్వర్యంలో వైఎస్సార్ నగర్‌లో పాదయాత్ర



**డోన్– సూర్య వాస్తవం :** డోన్ మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్సార్ నగర్ కాలనీలో ఇండ్ల ముందు కాలువల నిర్మాణం పేరుతో గుంతలు తవ్వి నెలలు గడుస్తున్నా పనులు పూర్తి చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కీ శ్రీకాంత్ విమర్శించారు గుంతల్లో మురుగునీరు నిల్వ ఉండటంతో పారిశుద్ధ్య సమస్యలు తీవ్రరూపం దాల్చి, చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయని అన్నారు. గురువారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో వైఎస్సార్ నగర్ కాలనీలో రెండో రోజు పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కీ శ్రీకాంత్,మండల కార్యదర్శి రామాంజనేయులు, కమిటీ సభ్యులు నాగ మద్దయ్య, షేమిమ్ బేగం, నక్కీ హరి మాట్లాడుతూ కాలువలు, రోడ్ల నిర్మాణ పనులు మధ్యలోనే నిలిపివేయడం వల్ల ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాలనీలో అధిక సంఖ్యలో రోజువారీ కూలీలు, పేద కుటుంబాలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ప్రజలు నివసిస్తున్నారని, అందుకే మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా అని ప్రశ్నించారు వర్షాలు పడుతున్న నేపథ్యంలో నిల్వ నీటి కారణంగా దోమలు పెరిగి ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల నుంచి పన్నులు వసూలు చేసే మున్సిపాలిటీ కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమైందని విమర్శించారు వైఎస్సార్ నగర్ కాలనీలో పెండింగ్‌లో ఉన్న కాలువలు, రోడ్ల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాలనీ ప్రజలను సమీకరించి మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు, మాధవి, బీబీ, లక్ష్మీ దేవి, ఇర్ఫాన, మదన గోపాల్, రాజు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన తులసి రెడ్డి



**వేంపల్లె – సూర్య వాస్తవం:** వేంపల్లె మండల కేంద్రంలో గురువారం షేక్ సానా – సయ్యద్ రషీద్ భాషా వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా ఛైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథరెడ్డి, ఐచర్ రమణ, చప్పిడి గంగాధర తదితరులు పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ మానవ సంబంధాలలో భార్యాభర్తల బంధం అత్యంత పవిత్రమైనదని పేర్కొన్నారు. వివాహం అనేది ఇద్దరి జీవితాలకు చట్టబద్ధతతో పాటు సామాజిక భద్రతను కల్పించే గొప్ప వ్యవస్థ అని అన్నారు. నూతన దంపతులు ఆనందంగా, పరస్పర అవగాహనతో జీవితాన్ని ముందుకు సాగించాలని ఆకాంక్షించారు.

## ఘనంగా కదిరి ఎమ్మెల్యేచే సినిమా పోస్టర్లు ప్రారంభం




**కదిరి – సూర్య వాస్తవం:** రాయలసీమ చిత్ర పరిశ్రమ కళాకారులను ఆదరించాలని ఉద్దేశంతో ఉమ్మడి జిల్లాల కళాకారులు జిఎంఎస్ గ్యాలరీ పతాకంపై నిర్మిస్తున్న "అనంతపురం నైట్స్"అనే చలనచిత్రాన్ని ప్రారంభించారు, అనంతరం సినిమా పూర్తి చేసుకుని కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ నివాసంలో ఆయన చేతుల మీదుగా సినిమా పోస్టర్ల విడుదల, డెమో ఫిలిం ప్రమోషన్స్‌లో భాగంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా చిత్ర యూనిట్ సభ్యుల గురించి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ చలనచిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ చిత్రంలో నటించిన, సాంకేతిక నిపుణులకు, కథా రచయిత, దర్శక, నిర్మాతలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కదిరి భారతీయ జనతా పార్టీ మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సాదిక్ భాషా, డైరెక్టర్ భాష పెనుగొండ, సినిమా యూనిట్ సభ్యులు సాంకేతిక నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ వెళ్లకుండా ఆన్‌లైన్‌లోనే ఫిర్యాదు చేయండి

- అనంతపురం జిల్లా ఎస్పీ జగదీశ్




**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఉపయోగించి పోలీస్ స్టేషన్కు వెళ్లకుండానే బాధితులు ఫిర్యాదు చేయవచ్చని అనంతపురం జిల్లా ఎస్పీ జగదీశ్ తెలిపారు. అనంతపురంలోని ఎస్పీ కార్యాలయంలో ఏఐ ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి బాధితుడు నేరుగా ఫిర్యాదు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పోలీస్ స్టేషన్లో తమ ఫిర్యాదులను తీసుకోలేదని బాధితులు తమ దృష్టికి చాలాసార్లు తెచ్చారన్నారు ఈ సమస్యను పరిష్కరించడం కోసమే పోలీస్ స్టేషన్కు వెళ్లకుండా బాధితుడే ఏఐ ప్రజావాణి లో తమ సమస్యను పేర్కొనవచ్చు అని చెప్పారు.ఏఐ ప్రజావాణిలో బాధితులు ఫిర్యాదు చేస్తేనే వెంటనే ఆక్లాన్మెంట్ కార్డుతో సహా ఏ టైం లో ఫిర్యాదు చేశారు ఆయా పోలీస్ స్టేషన్ లకు వెళుతుందని తెలిపారు అనంతపురం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు అనంతరం అన్ని పోలీస్ స్టేషన్లలో అమలు అయ్యేలా చూస్తామని ఎస్పీ చెప్పారు.



## మీ సమస్య మా బాధ్యత- మీ సమస్య మా పరిష్కారం

- టీడీపీ 19, 24, వార్డుల సమావేశం

**కదిరి – సూర్య వాస్తవం:** వాయిస్ ఆఫ్ సిటిజన్ పేరుతో మీ సమస్య మా బాధ్యత–మీ సమస్య మా పరిష్కారం కార్యక్రమాన్ని వార్డు స్థాయిలో నిర్వహించిన కార్యక్రమానికి కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకట ప్రసాద్ ఆదేశాల మేరకు గురువారం కదిరి పట్టణంలోని మునిసిపల్ పరిధిలో 19వ మరియు 24వ యూనిట్ తెలుగుదేశం పార్టీ సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కదిరి తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి నాయకులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నాయకులందరూ కృషి చేయాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. యూనిట్ స్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని, అలాగే నియోజకవర్గ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ వాయిస్‌ఆఫ్ సిటిజన్ మీ సమస్య మా బాధ్యత మీ సమస్య పరిష్కారం మా కర్తవ్యం అనే మంచి ఆలోచనతో ప్రజలకు సేవ చేసే విధంగా టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశారు ఆ నెంబర్ కూడా ప్రజలకు తెలియజేస్తే సమస్యలన్నిటిని శాసనసభ్యులు గారు పరిష్కరిస్తారు టోల్ ఫ్రీ నెంబర్ 04048210053, 04045210910 వారి సమస్యలు తెలియజేస్తే సమస్య పరిష్కారం అవుతుంది అలాగే రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.
పార్టీ విజయానికి కార్యకర్తలే వెన్నెముక అని పేర్కొంటూ, అందరూ ఐకమత్యంతో పనిచేసి తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో 19వ యూనిట్ ఇంచార్జ్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గంగయ్య నాయుడు 24 యూనిట్ ఇంచార్జ్ ఇన్యత్ కిషోర్ ఫారూఖ్ అజిముల్లా , 19వ 20 యూనిట్ సంబంధించిన బూత్ కన్వీనర్లు మరియు సభ్యులు పాల్గొన్నారు...

## బ్యాంకు ఖాతాదారులకు శక్తి టీం అవేర్నెస్ ప్రోగ్రాం



**రాయచోటి – సూర్య వాస్తవం :** మండల కేంద్రమైన చిన్నమండెంలో గురువారం ఎస్‌బిఐ ఖాతాదారులకు శక్తి టీం అవరెన్స్ ప్రోగ్రాం జరిగింది. ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ మేనేజర్, సబ్ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఖాతాదారులకు సైబర్ క్రైమ్ ఫ్రాడ్ కాల్స్, డిజిటల్ అరెస్ట్ ఓటిపిఐ మోసల గురించి తెలియజేశారు. అలాగే బ్యాంకుల్లో ఇతరులకు షూరిటీ ఇచ్చి ఇబ్బందులకు గురి కాకూడదని చెప్పారు. పిల్లలకు మొబైల్ ఇచ్చి గేమ్స్ లో వచ్చే ఓటీపీలు నొక్కు తారు. అరచేయకుండా జాగ్రత్తగా ఉండాలని వారు సూచించారు. ఈ కార్య క్రమంలో బ్యాంకు సిబ్బంది, పలువురు ఖాతాదారులు, స్థానికులు పాల్గొన్నారు.

## పరిహారం చెల్లించాకే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి

- సిపిఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు



**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం:** లక్కిరెడ్డిపల్లి నేషనల్ హైవే ఎన్‌హెచ్–440 రహదారి విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోయిన బాధితు లకు పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించిన తరువాతే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని సిపిఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం సిపిఐ నాయకులతో కలిసి కూల్చివేసిన ఇళ్లను పరిశీలించిన ఆయన బాధిత కుటుంబాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, ముందస్తు సమాచారం లేకుండా ప్రజల ఇళ్లను తొలగించడం అన్యాయ మని అన్నారు. ఇల్లు కోల్పోయిన కుటుంబాలు ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నాయని తెలిపారు. ప్రభుత్వ అధికారులు, నేషనల్ హైవే అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించి బాధితులకు తగిన నష్టపరిహారం, పునరా వాసం కల్పించాలని కోరారు. అంతేకాకుండా, పరిహారం అందని కుటుంబాల జాబితాను వెంటనే సిద్ధం చేసి పారదర్శకంగా చెల్లింపులు జరపాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు సిపిఐ తరఫున పోరాటం కొనసాగిస్తా మని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాధితులు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటుదాం.. పర్యావరణ పరిరక్షణ కాపాడుదాం



**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం:** పర్యావరణం సమతుల్యంగా ఉండాలంటే భూమిపై పచ్చదనం పెరగాలి. ఇందుకు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎంపీడీవో రెడ్డయ్య విస్తరణ అధికారి ఉషారాణి పేర్కొన్నారు. గురువారం స్థానిక గ్రామ పంచా యతీ కార్యా లయంలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు నాటి సంరక్షిస్తేనే పచ్చదనం లభిస్తుందని, తద్వారా కాలుష్యం లేకుండా ప్రాణకోటికి స్వచ్ఛమైన గాలి లభిస్తుందన్నారు. తద్వారా వర్షాలు కూడా సమృద్ధిగా కురుస్తాయన్నారు. చెట్లను నరికి వేయవద్దని, ఇళ్ల ముందు మొక్కలు నాటి సంరక్షించుకొంటే ఆహ్లాదాన్ని ఇస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సుబ్బారెడ్డి పంచాయతీ సిబ్బంది హరీష్ ప్రసాద్ గ్రామ ప్రజలు మరియు ఎస్‌ఎంబీజీ కన్సల్ట్ బి మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు

## అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి

# అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేస్తాం..

**- జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ 2వ సమావేశంలో 97 అక్రిడిటేషన్ లు మంజూరు**

**- కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ ఓ.ఆనంద్**





**అనంతపురం – సూర్య వాస్తవం :** జిల్లాలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేయడం జరుగుతుందని కలెక్టర్ మరియు జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ ఓ.ఆనంద్ స్పష్టం చేశారు. గురువారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ మీటింగ్ హాల్లో ఐ.అండ్.పీఆర్ (జిల్లా సమాచార మరియు పౌర సంబంధాల శాఖ) ఆధ్వర్యంలో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ 2వ సమావేశాన్ని కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ ఓ.ఆనంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ నియమ నిబంధనలను అనుసరించి అర్హత కలిగిన ప్రతి ఒక్క జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ మంజూరు చేసిన అక్రిడిటేషన్ కార్డులలో నిబంధనల ప్రకారం ఏవైనా అభ్యంతరాలు ఉంటే సభ్యులు కమిటీ దృష్టికి తీసుకురావడం చేయాలని, దానిపై విచారించి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ మీటింగ్ కు 5 రోజుల ముందు ప్రిపరేటరీ మీటింగ్ ను సభ్యులతో నిర్వహించాలని ఐ.అండ్.పీఆర్ డిఐపిఆర్ఓ మరియు డిఎంఏసి మెంబర్ కన్వీనర్ కు సూచించారు. అక్రిడిటేషన్ కొనసాగాలంటే పేపర్ల రెగ్యులారిటీ ఖచ్చితంగా ఉండాలని, లేకపోతే తొలగించాలని కమిటీ నిర్ణయించింది. ఈ సమావేశంలో జిల్లాలో రెండవ విడతగా 97 అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేయడం జరిగింది. ఇందులోభాగంగా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ మానవతా దృక్పథంతో ఆలోచించి అర్హత కలిగిన వారికి అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని కోరగా, క్రమం తప్పకుండా పత్రికలు, పీరియాడికల్స్ డిఐపిఆర్ఓ కార్యాలయానికి అందచేయాలని, నిజాయితీగా ఉండే వాళ్లకి, ఎలాంటి తప్పులు చేయని వారికి నిబంధనల ప్రకారం అక్రిడిటేషన్లను మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఐ.అండ్.పీఆర్ డిఐపిఆర్ఓ, డిఎంఏసి మెంబర్ కన్వీనర్ ఏ.బాలకొండయ్య, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు ఎస్.మహమ్మద్ అయుఫ్, ఏ.షఫీఉల్లా, సి.రవికుమార్, సి.ప్రతాప్, కె.అనిల్ కుమార్ రెడ్డి, కె.మల్లికార్జునరావు, ఎస్ఎండి.రసూల్, ఆర్.రామంజినేయులు, ఆర్విఎస్.ప్రసాద్, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, లేబర్ కార్యాలయం ఏసీఎల్ లావణ్య, గృహ నిర్మాణ శాఖ అధికారి, ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం శ్రీలక్ష్మి, ఐ.అండ్.పీఆర్ ఏపీఆర్ఓ ఫక్రుద్దీన్, పిఆర్ఓ వి.సూర్యనారాయణ రెడ్డి, టైపిస్ట్ దామోదర్ రెడ్డి, టెక్నీషియన్ కమల్, తదితరులు పాల్గొన్నారు.

## రెండవ ఘాట్ రోడ్డు నిర్మాణానికి

# అటవీ అనుమతులు మంజూరు చేయండి

**- మంత్రి భూపేంద్ర యాదవ్‌కి రాయలసీమ రాష్ట్ర సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డాక్టర్ కుంచం వెంకటసుబ్బారెడ్డి వినతి**



**ప్రొద్దుటూరు – సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మార్కాపురం జిల్లా దోర్నాల నుంచి శ్రీశైలం వరకు రెండవ ఘాట్ రోడ్డు నిర్మాణానికి అటవీ అనుమతులు మంజూరు చేయవలసినదిగా కోరుతూ కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మంత్రి భూపేంద్ర యాదవ్‌కి రాయలసీమ రాష్ట్ర సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డా.కుంచం వెంకటసుబ్బారెడ్డి వినతి పత్రంలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలోని భక్తులు, ప్రజల తరపున నమస్కరించి తెలుపుకుంటున్న విషయమేమనగా, ఆంధ్రప్రదేశ్ నంద్యాల జిల్లా (అప్పటి కర్నూలు జిల్లా)లోని నల్లమల్ల అడవులలో, కృష్ణా నదీ తీరాన వెలసిన శ్రీశైలం హిందూ మతంలో అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రంగా వాసికెక్కినది.

ఇది ద్వాదశ జ్యోతిర్లింగాలలో మొట్ట మొదటిదియే కాకుండా అష్టాదశ పీఠాలలో ఒకటైన భ్రమరాంబికా దేవి కొలువైన దివ్య పుణ్యక్షేత్రం. స్కంద పురాణం ప్రకారం శ్రీశైల క్షేత్రం శివ శక్తుల సమ్మేళనం అయినందున యీ క్షేత్రాన్ని దర్శించడం వలన సకల పాపాలు హరిస్తాయని, ఈ కార్తీక మాసంలో ఇక్కడ పరమేశ్వరున్ని దర్శించుకుంటే వేయి యజ్ఞాలు చేసిన ఫలితం దక్కుతుందని భక్తుల విశ్వాసం. అత్యంత ప్రాచీనమైన ప్రముఖమైన జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలం క్షేత్రానికి చేరుకోవడానికి ప్రకాశం జిల్లా దోర్నాల నుంచి శ్రీశైలం వరకు అటవీ ప్రాంతంలో ప్రస్తుతం వున్న ఘాట్ రోడ్ చాలా యిరుకుగా, మలుపులతో నిండి వుండడంతో భక్తులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దేశంలో వివిధ ప్రాంతాల నుండియే గాక విదేశాల నుంచి కూడా ప్రతిరోజు వేలాది మంది భక్తులు శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి వారిని దర్శించు కొనుటకు తరలి వస్తుంటారు. పండుగలు, పర్వదినాలలో, సెలవు దినాలలో వాహనాల రద్దీ విపరీతంగా పెరిగి ప్రయాణం అత్యంత క్లిష్టతరంగా మారుచున్నది. ఈ ఘాట్ రోడ్ అటవీ ప్రాంతం గుండా వెళ్ళడం వలన రోడ్డు విస్తరణ, ఆధునీకరణ పనులు తగిన విధంగా జరగడం లేదు. పలు ప్రమాదకర మలుపులు, ఎత్తైన లోయలు వున్నందున, ఒకేసారి రెండు భారీ వాహనాలు సురక్షితంగా దాటలేని పరిస్థితుల కారణంగా భక్తుల ప్రాణాలకు ముప్పుగా మారుతూ, తరచుగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తూ ప్రజలు మరియు భక్తులు ప్రాణనష్టం, ఆస్తినష్టం చవిసూస్తున్నారు. అత్యవసర పరిస్థితులలో అంబులెన్సు అగ్నిమాపక వాహనాలు కూడా సకాలంలో చేరుకోలేకపోతున్నాయని తెలిపారు. శ్రీశైలం దేవస్థానం భారతదేశంలో అత్యంత ప్రాచీనమైనందున ప్రతి సంవత్సరం భక్తుల తాకిడి పెరుగుతుండడంతో రవాణా సౌకర్యం మెరుగుపరచడం అత్యవసరంగా వుందన్నారు. ఈ సమస్య అధిగమించాలంటే మార్కాపురం జిల్లా దోర్నాల నుండి శ్రీశైలం వరకు రెండవ ఘాట్ రోడ్ నిర్మాణం జరిగితే భక్తుల రాకపోకలు, సులభతరం అవడంతోపాటు ప్రమాదాలు గణనీయంగా తగ్గే అవకాశం వుందన్నారు. అత్యవసర సేవలు వేగంగా అందుబాటులోకి రావడంతో ప్రాణ నష్టం ఆస్తినష్టం కాకుండా రక్షించవచ్చు. రెండప ఘాట్ రోడ్ నిర్మాణం వల్ల శ్రీశైలం ప్రాంతంలో పర్యాటకాభివృద్ధి, స్థానిక ఉపాధి అవకాశాలు, ఆర్థికాభివృద్ధి పెరగడం వలన ప్రభుత్వ ఆదాయం పెరగడంతోపాటు ప్రాంతీయ అభివృద్ధికి కూడా దోహద పడుతుంది. భక్తుల, ప్రజా ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకొని, పర్యావరణ పరిరక్షణకు భంగం వాటిల్లకుండా ఆధునిక సాంకేతిక ప్రమాణాలతో ఘాట్ రోడ్డు నిర్మాణం చేపట్టవచ్చు. అటవీ సంపదకు కనిష్ట నష్టం కలిగే విధంగా ప్రత్యామ్నాయ వనరూపణ కార్యక్రమాలు కూడా అమలు చేయవచ్చు అన్నారు. కావున ప్రకాశం జిల్లా దోర్నాల నుండి శ్రీశైలం వరకు రెండవ ఘాట్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన అటవీ అనుమతులు క్లియరెన్సును యుద్ధప్రాతిపదికన మంజూరు చేసి కోట్లాది మంది భక్తులకు, ప్రజలకు సురక్షితమైన ప్రయాణ సౌకర్యం కల్పించవలసినదిగా మనవి చేశారు. తమరు యీ అంశాన్ని సానుకూలంగా పరిశీలించి, తగిన ఆదేశాలు జారీ చేస్తారని ఆశిస్తూవున్నానని వివరించారు.

# ప్రజలను వెన్నుపోటు పొడిచిన కూటమి ప్రభుత్వం

**- టీడీపీ మేనిఫెస్టో, సూపర్ సిక్స్ హామీల బాండ్‌ల దగ్ధం**



**సింహాద్రిపురం – సూర్య వాస్తవం :** మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి మరియు కడప ఎంపీ అవినాష్ రెడ్డి ఆదేశాల మేరకుకూటమి ప్రభుత్వం ప్రజలను వెన్నుపోటు పొడిచిన వైనం పై నిర్వహించిన వెన్నుపోటుకు రెండేళ్లు నిరసనలి కార్యక్రమంలో భాగంగా గురువారం సింహాద్రిపురంలో వైయస్సార్సీపి మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, సింహాద్రిపురం మండల వైకాపా నాయకులు కార్యకర్తల ఆధ్వర్యంలో టీడీపీ మేనిఫెస్టో, సూపర్ సిక్స్ మరియు హామీల బాండ్ లను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసింది అని చంద్రబాబు మోసాలకు బూటకపు వాగ్దానాలను రెండేళ్లు పూర్తి కావస్తున్న సందర్భంగా వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఏ ఒక్క వర్గం కూడా సంతృప్తి గా లేరన్నారు, ప్రజలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వైసీపీ బందిపోటు పాలనకు విముక్తికి రెండేళ్లు

**- మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ రాష్ట్ర తెలుగు యువత మాజీ కార్యదర్శి మసూలు చంద్రమోహన్**



**శింగనమల– సూర్య వాస్తవం :** వైసిపి బందిపోటు పాలన నుండి రాష్ట్రానికి విముక్తి లభించి నేటికీ రెండేళ్లు పూర్తి అయ్యిందని 2024 జూన్ 4వ తేదీన ఆంధ్ర ప్రదేశ్ ఓటర్లు చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని ఐదేళ్ల వైసిపి అరాచక అవినీతి విధ్వంస పాలనకు సమాధి కట్టారని మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ రాష్ట్ర తెలుగు యువత మాజీ కార్యదర్శి మాసూలు చంద్రమోహన్ అన్నారు, ప్రజలు నవ్యాంధ్ర ప్రగతికి బాటలు వేశారని,విధ్వంస రాజకీయాలు చేసిన జగన్ రెడ్డికి కేవలం 11 సీట్లు ఇచ్చి ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా తనిమికొట్టారు.

వైసిపి ఎమ్మెల్యేలు ఓటమి తర్వాత కూడా అసెంబ్లీకి రాకుండా ప్రజా సమస్యలపై మాట్లాడకుండా, అప్పుడప్పుడు ప్రెస్ మీట్ పెట్టి వెన్నుపోట్లు,ప్రజా ఆకాంక్షల కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యంగా రైతులు మహిళలు యువత ఉద్యోగులు సహా ప్రతి వర్గం కోసం పనిచేస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని అన్ని ప్రాంతాల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వమని గత రెండు సంవత్సరాలు నిరంతరం సంక్షేమం అభివృద్ధి ధ్యేయంగా రాష్ట్ర అభివృద్ధి కొరకు పాటు పడుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి మంత్రి లోకేష్ కి ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీకి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకి మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ మాసూల్ చంద్రమోహన్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.

## దిగుబడి లేక అప్పుల పాలైన కౌలు రైతు..

**- పత్తి పంటను పశువులకు వదిలేసిన వైనం**



**ఉరవకొండ – సూర్య వాస్తవం :** విడపనకల్లు మండల పరిధిలోని కరకముక్కల గ్రామంలో ఒక కౌలు రైతుకు తీవ్ర నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన కృష్ణ అనే కౌలు రైతు ఏడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి పంటను సాగు చేశారు. ఎంతో ఆశతో, పెట్టుబడి పెట్టి పంట వేసినప్పటికీ.. చెట్లు ఆశించిన స్థాయిలో ఎదుగుదల లేకపోవడంతో సరైన దిగుబడి రాలేదు. ?పశువుల మేతగా మారిన పత్తి చేను దిగుబడి పూర్తిగా తగ్గిపోవడంతో, కనీసం చేతికి వచ్చిన పంటను కోస్తే ఖర్చులు కూడా రావని గ్రహించిన బాధిత రైతు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. దీంతో చేసేదేమీ లేక పత్తి పంటను అలాగే వదిలేశారు. ప్రస్తుతం ఆ పంటను గొర్రెలు, మేకలు, మరియు పశువుల మేతగా వదిలేసినట్లు రైతు కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. **సాగు చేసిన విస్తీర్ణం:** 7 ఎకరాలు **వాటిల్లిన నష్టం:** సుమారు రూ. 2 లక్షలు పెట్టిన పెట్టుబడి కూడా రాకపోవడంతో అప్పుల పాలయ్యానని, ప్రభుత్వం తమలాంటి కౌలు రైతులను ఆదుకోవాలని బాధిత రైతు వాపోతున్నారు.

## హామీలు మరిచిన కూటమి ప్రభుత్వానికి ప్రజలే గుణపాఠం చెబుతారు

**- మండల కన్వీనర్ సుదర్శన్ రెడ్డి**

**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం :** హామీలు మరచిన కుటమి ప్రభుత్వానికి ప్రజలే గుణపాఠం చెబుతారని వైస్సార్సీపీ మండల కన్వినర్, ఏంపిపి సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని స్థానిక వైస్సార్సీపీ కార్యాలయంలో స్థానిక ప్రజాప్రతినిధులు తో కలిసి కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యి రెండేళ్ల పాలనలో ప్రజలకు యిచ్చిన హామీలు అమలు చేయకపోవడం పై వెన్నుపోటుకు రెండేళ్లు అనే కార్యక్రమము ప్రతులు చూపెడుతూ వాటికి నిప్పు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్బంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి రెండేళ్లు పూర్తి అయినా 50 ఏళ్లు దాటిన ప్రతి ఒక బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు పెన్షన్ ఇస్తామని చెప్పిన ఆ ఊసే లేదన్నారు. 18 ఏళ్లు దాటిన మహిళలకు నెలకు రూ.1,500 అందిస్తామన్న హామీ కూడా అమలు కాలేదని గుర్తు చేశారు. అర్హత ఉన్న వారికి ఒక్క కొత్త పెన్షన్ గానీ, ఒక్క పక్కా ఇల్లు గానీ మంజూరు చేయలేకపోయినా ప్రభుత్వం అభివృద్ధి గురించి మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. ఈ కార్యక్రమం లో ఎంపిటిసి లు జగన్మోహన్ రెడ్డి, శంకర్ నాయుడు, లక్ష్మీనారాయణ,మాజీ సర్పంచ్ లు దేవేంద్ర రెడ్డి, ప్రభాఖర్ రెడ్డి, మహేంద్ర బాబు, జనార్దన్ రెడ్డి, రమణయ్య, సుబ్బారాజు, నాగేంద్ర, మాజీ ఎంపిటిసి రామ్మోహన్ శెట్టి,,శ్రీనివాసులు, మాజీ ఉప సర్పంచ్ రాజారెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# నా మనసంతా -పెద్ది' దగ్గరే

## : చిరంజీవి



**హైదరాబాద్ :** తన మనసంతా – పెద్ది' దగ్గరే ఉందని టాలీవుడ్ నటుడు చిరంజీవి పేర్కొన్నారు. రామ్ చరణ్ నటించిన పెద్ది సినిమా గురువారం విడుదలైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా రామ్ చరణ్, పెద్ది సినిమా దర్శక, నిర్మాతలు, ఇతర నటులు, సాంకేతిక బృందానికి అభినం దనలు తెలుపుతూ చిరంజీవి ఎక్స్ లో పోస్ట్ చేశారు. "నేను షూటింగ్ నిమిత్తం పొల్లాచిలో ఉన్నా కూడా నా మనసంతా "పెద్ది" దగ్గరే ఉంది. గత రెండేళ్లుగా ఈ సినిమా కోసం చరణ్ పడిన కష్టం, చూపిన శ్రద్ధను దగ్గర నుండి చూశాను. ఈ రోజు ప్రేక్షకుల ప్రేమ, ప్రశంసలు చూస్తుంటే ఒక తండ్రిగా మాత్రమే కాదు, ఒక నటుడిగా కూడా ఎంతో గర్వంగా అనిపిస్తోంది. 'పెద్ది' పాత్రలో పూర్తిగా లీనం కావడానికి తను అహర్నిశలు చేసిన కృషి, పట్టుదల, నిజాయితీ ప్రతి సన్నివేశంలోనూ కనిపిస్తున్నాయి. ఆ కష్టానికి దక్కిన ప్రతిఫలమే ఈ విజయం" అని రామ్ చరణ్‌ను ప్రశంసించారు. దర్శకుడు బుచ్చిబాబు, నిర్మాత వెంకట సతీశ్ కిలారు, ఈ చిత్రంలో నటించిన తన మిత్రుడు 'కరునాడ చక్రవర్తి' శివరాజ్ కుమార్, తన సోదర సమానుడు జగపతిబాబుకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. అలాగే సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్, నటి జాన్వీ కపూర్, దివ్యేందుతో పాటు సాంకేతిక నిపుణులందరికీ కంగ్రాట్స్ అంటూ చిత్రబృందాన్ని అభినందించారు. 'పెద్ది' సాధించిన విజయం తెలుగు సినిమాకి గర్వంగా నిలవాలని, మరెన్నో మైలురాళ్లు అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా అని ఎక్స్ పోస్ట్ లో పేర్కొన్నారు.

# చిక్కుల్లో యూట్యూబర్

## రమా నందన ఫ్యామిలీ!

ప్రముఖ యూట్యూబర్ నందు కుటుంబంపై చీటింగ్ కేసు నమోదు
యూకే వీసా రెన్యూవల్ పేరుతో రూ. 15 లక్షలు మోసం చేశారని ఆరోపణ
బాధితుడి ఫిర్యాదుతో ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పోలీసులు ఎఫ్ఐఆర్
డెస్టినీ కన్సల్టెన్సీ ద్వారా మోసానికి పాల్పడినట్లు ఫిర్యాదులో వెల్లడి



ప్రముఖ యూట్యూబర్, 'నందు'స్ వరల్డ్' ఫేమ్ రామా నందన, ఆమె భర్త జాగర్లమూడి మధుకర్, ఆయన తండ్రిపై చీటింగ్ కేసు నమోదైంది. యూకే వీసా రెన్యూవల్ పేరుతో రూ.15 లక్షలు తీసుకుని మోసం చేశారని ఆరోపిస్తూ ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ దాఖలైంది.

'రయ్ రయ్ రారా..' అంటూ థియేటర్లలోకి దూసుకొచ్చిన పెద్ది సినిమా గురువారం థియేటర్లలో విడుదలై, బాక్సాఫీస్ వద్ద పాజిటివ్ టాక్‌ను అందుకుంది. గేమ్ చేంజర్ తర్వాత రామ్ చరణ్, దేవర తర్వాత రెండో తెలుగు చిత్రంతో జాన్వీ కపూర్ జంటగా, పెద్ద అంచనాలతో బాక్సాఫీస్ బరిలో దిగిన ఈ సినిమా ఫర్వాలేదనిపించింది. పెద్ద హీరోల సినిమాలు లేక థియేటర్లు వెలవెలబోతున్న తరుణంలో, మళ్లీ ఈ సినిమాతో కళకళలాడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ సినిమా స్క్రిప్టును బుచ్చిబాబు రాయగా, కళింగాంధ్ర యాసలోకి మార్చింది ప్రముఖ కథ, నవల, సినీ రచయిత చింతకింది శ్రీనివాసరావు. శ్రీకాకుళం, విజయనగరం యాసభాషలను తెరపై ఆయన సమర్థంగా నిలిపారు. అది కథకు నిండుగా, పూలదండలా అమరింది. భిన్నమైన నవ్యత్వాన్ని తీసుకొచ్చింది. నటీనటులంతా ఈ జనం భాష సొబగులను, సోయగాలను పలికించారనే చెప్పాలి. గుర్తింపు కోసం ఓ యువకుడు చేసే క్రీడా పోరాటమే ఈ పెద్ది కథ.

"మళ్లీ పుడతామా ఏంటి!" అనేది పెద్ది చెప్పే లైన్. ఏది సాధించాలనుకున్నా, దానికోసం ఎంత కష్టమైనా పడాలి; ఏ స్థాయి త్యాగమైనా చేసేయాలి. ప్రాణం ఉన్నలోపే అది సాధించేయాలి. కాగా, ఈ చిత్రం ద్వారా బుచ్చిబాబు చేసిన మరో సాహసం క్రికెట్, కుస్తీ, రన్నింగ్ క్రీడల్ని ఎంచుకుని వాటితో కథ రాసుకోవడం. దేశంలో ఆటలకు ప్రోత్సాహం పెరగాలని, కథానాయక పాత్ర సాయంతో క్రీడల పట్ల ఆసక్తి, క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మగౌరవం, ఉనికి, త్యాగం, బాధ్యత లాంటి గొప్ప గుణాలను అలవరుచుకోవాలని పిలుపునివ్వడం స్వాగతించదగిన విషయం.

?ఇందులో సందర్భోచితమైన సంభాషణలు ఎన్నో ఉన్నాయి. దర్శకుడు బుచ్చిబాబు స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో ఓ ఎమోషనల్ స్టోరీగా పెద్దిని తెరకెక్కించారు. స్పోర్ట్స్ డ్రామా అయినప్పటికీ, ఈ కథలో ఓ ప్రత్యేకత ఉంది. హీరో ఒక ఆటకే పరిమితం కాదు. క్రికెట్‌తో తెరపై ఎంట్రీ ఇచ్చి, కుస్తీతో ఆకట్టుకొని, అథ్లెట్‌గా ప్రేక్షకుల హృదయాలను గెలుస్తాడు. మూడు విభిన్నమైన క్రీడల్నీ తీసుకున్న బుచ్చిబాబు, వీటి మధ్యలో ఓ ఎమోషనల్ కథను చక్కగా చెప్పారు. రామ్ చరణ్ నటన, రెహమాన్ నేపథ్య సంగీతం ఆద్యంతం ఆకట్టుకునేలానే సాగాయి.

**మూడు ఆటల్లోనూ విభిన్నంగా ....**

ఈ సినిమా రామ్ చరణ్ వన్‌మ్యాన్ షోగా చెప్పుకోవచ్చు. క్రికెటర్‌గా, కుస్తీ ఆటగాడిగా, అథ్లెట్‌గా మూడు విభిన్నమైన పాత్రలతో కనిపించిన చరణ్, ప్రతి పాత్రలోనూ వైవిధ్యం చూపించి ఆకట్టుకున్నారు. ఈ



# ఆడి, గెలిచిన పెద్ది!

సినిమా కోసం చరణ్ పడిన కష్టం ప్రతి ఫ్రేములోనూ కనిపిస్తుంది. అప్పలసూరి పాత్రతో జగపతి బాబు ఒదిగిపోయారు. కుస్తీ గురువు గౌర్నాయుడు పాత్రకు శివరాజ్‌కుమార్ న్యాయం చేశారు. ఎప్పుడైతే పెద్ది పాత్ర ఎంట్రీ ఇచ్చి గ్రౌండ్‌లో సిక్సర్ కొడతాడో, అప్పటి నుంచీ కథనం ఆసక్తికరంగా సాగడం ప్రారంభిస్తుంది. అచ్చియమ్మగా జాన్వీ కపూర్ మాస్ ఎంట్రీ బాగానే ఉంది. తల్లి శ్రీదేవిని మించిన అందంతో ఆమె ఈ సినిమాలో కనిపిస్తారు. జగపతి బాబు పాత్రకు సంబంధించిన సన్నివేశాలు ఎమోషనల్‌గా సాగుతాయి. ఫస్టాఫ్ మొత్తం పక్కా కమర్షియల్ మీటర్‌లో తీర్చిదిద్దిన బుచ్చిబాబు, సెకండాఫ్‌ని మాత్రం చెప్పాల్సిన పాయింట్‌పైనే ఫోకస్ పెట్టాడు. ద్వితీయార్థంలో వచ్చే కుస్తీ ఎపిసోడ్స్ అన్నీ ఆకట్టుకుంటాయి. ఒకవైపు కుస్తీ పోటీలు జరుగుతుండగానే కీలక మలుపు రావడంతో కథ మరింత రసవత్తరంగా మారుతుంది. ఢిల్లీ ఎపిసోడ్‌లో ఊరి గుర్తింపు కోసం హీరో తీసుకునే కఠిన నిర్ణయం మాత్రం హృదయాలను కలచివేస్తుంది. క్రీడలకు సంబంధించిన ఎపిసోడ్స్ విషయంలో దర్శకుడు చాలా వరకు సినిమాటిక్ లిబర్టీ తీసుకున్నాడు. ప్రీ-క్లైమాక్స్ నుంచి క్లైమాక్స్ వరకు కథనం ఎమోషనల్‌గా సాగుతుంది.

రామ్ బుజ్జిగా దివ్యేందుతో పాటు మిగిలిన నటీనటులు తమ పాత్రల పరిధి మేరకు నటించారు. సాంకేతికంగా సినిమా బాగుంది. ఏఆర్ రెహమాన్ నేపథ్య సంగీతం సినిమాకు మరో ప్రధాన బలం. పాటలు బాగున్నాయి. రత్నవేలు సినిమాటోగ్రఫీ సినిమా స్థాయిని పెంచేసింది. ఆర్ట్ డిపార్ట్‌మెంట్ పనితీరు బాగుంది. ఎడిటింగ్ ఫర్వాలేదు. నిర్మాణ విలువలు బాగున్నాయి.

**కథలోకి వెళ్తే...**

విజయనగరం, బొబ్బిలి ప్రాంతంలో కొండ కింద ఉండే ఒక ఊరు. ఆ ఊరికి రోడ్డు మార్గం లేదు. ఆ ఊరికి పక్కగా రైలు పట్టాలున్నా స్టేషన్ లేదు. పైగా, ఆ ఊరిలో ఉన్న 1,800 మందికి ఏ గుర్తింపూ లేదు. ఎందుకంటే అసలు ఆ ఊరు ఏ జిల్లాలోకీ రాని అనాథ. ఎన్ని కష్టాలున్నా, ఎన్ని చావులొచ్చినా ఆ జనం ఆ ఊరు వదిలి బయటికి వెళ్లరు. అటు విజయనగరం వాళ్లకు, ఇటు బొబ్బిలి వాళ్లకు వాళ్లంటే చిన్నచూపు. వాళ్లను కేవలం రోజు కూలీలుగా, వెట్టిచాకిరీలకు వాడుతుంటారంతే. ఆ ఊరివాడు పెద్ది (రామ్ చరణ్). అతను క్రికెట్‌లో నంబర్ వన్. విజయనగరం, బొబ్బిలి వాళ్లు వేలంపాటలో అతన్ని పాడుకుని తమ జట్లలో ఆటకూలీగా ఆడించుకుంటూ ఉంటారు. అతని క్రికెట్ ఆటలో ఒడుపులు చూసి నాయుడు (శివరాజ్ కుమార్) అనే కుస్తీ గురువు కుస్తీ కూడా నేర్పుతాడు. ఆ కుస్తీతో జాతీయ స్థాయిలో ఆడి, తన ఊరికి గుర్తింపుతో పాటు రైల్వే స్టేషన్ కూడా తీసుకురావాలనేది పెద్ది ధ్యేయం. ఆ లక్ష్యాన్ని ఎలా చేరతాడు? ఎన్ని త్యాగాలు చేయాల్సి వస్తుంది? అనేదే తక్కిన కథ.

లెన్త్ ఎక్కువగా తీసి ఆతర్వాత కట్ చేయటంతో కథాగమనంలో కొన్నిచోట్ల కంటిన్యూటీ లేనట్లుగా కనిపించింది. హీరోయిన్ జాన్వీకపూర్ పాత్ర కనిపించిన సందర్భాల్లో కొన్నిచోట్ల ఇదే స్పష్టంగా కనిపించింది. మొత్తంగా పరిశీలిస్తే రామ్ చరణ్ ఈ సినిమా కోసం బాగా కష్టపడ్డాడు. ఒన్ మేన్ షోగా ఆద్యంతం సినిమా సాగుతుండటం చూసిన వారెవ్వరికైనా ఇట్టే అర్థమవుతుంది.



# టీమ్ ఇండియా కెప్టెన్ కుర్చీ... శ్రేయస్‌దా? శాంసన్‌దా? లేక సెలక్టర్లదే కన్ఫ్యూజనా!



భారత టీ20 క్రికెట్ జట్టుకు కొత్త బాస్ ఎవరు? ప్రస్తుతం సోషల్ మీడియా నుండి టీవీ ఛానెళ్ల వరకు ఎక్కడ చూసినా ఇదే హాట్ టాపిక్. భారత జట్టు కొత్త టీ20 కెప్టెన్ ఎవరు అనే ప్రశ్నకు బీసీసీఐ సమాధానం చెప్పేలోపే, క్రికెట్ అభిమానులు మూడు వర్గాలుగా విడిపోయారు. ఒక వర్గం "శ్రేయస్ అయ్యర్ ఫిక్స్" అంటుంటే.. మరో వర్గం "శాంసన్‌కే ఛాన్స్" అని సోషల్ మీడియాలో గట్టిగా బ్యాటింగ్ చేస్తోంది.

ఇక మూడో వర్గం మాత్రం "రేపు ఇంకో పేరు వస్తుంది చూద్దాం" అంటూ చేతిలో పాప్‌కార్న్ పట్టుకుని మరీ ఈ డ్రామాను ఎంజాయ్ చేస్తోంది. గంభీర్ ఎంట్రీతో మారిన సమీకరణాలు! తాజా కథనాల ప్రకారం.. శ్రేయస్ అయ్యర్ పేరు దాదాపు ఖరారైందనే వార్తలు వచ్చాయి. ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌ను విజేతగా నిలిపిన ట్రాక్ రికార్డ్ శ్రేయస్ సొంతం. కానీ ఇక్కడే ఊహించని ట్విస్ట్ ఎదురైంది! కొత్త హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ మాత్రం "ఆగండి బాస్!" అంటూ సంజూ శాంసన్ పేరును తెరపైకి తెచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.

గంభీర్ కు సంజూ శాంసన్ ఆటతీరు, అతని లీడర్‌షిప్ క్వాలిటీస్ పై గట్టి నమ్మకం ఉందట. దీంతో సెలక్షన్ కమిటీ అధికారిక సమావేశం కంటే, సోషల్ మీడియా వాట్సాప్ గ్రూపుల్లోనే ఎక్కువ చర్చ నడుస్తోంది. ప్రస్తుతం ఈ ఇద్దరూ ప్రధాన పోటీదారులుగా రేసులో దూసుకుపోతున్నారు. రేసులో 'ఇతరులు'.. అభిమానుల జోకులు! ఈ ఇద్దరితో పాటు యువ ఆటగాళ్లు తిలక్ వర్మ, ఇషాన్ కిషన్ పేర్లు కూడా కెప్టెన్సీ రేసులో ఉన్నాయని కొన్ని కథనాలు చెబుతున్నాయి.

అయితే వాళ్ల పరిస్థితి ఇప్పుడు ఎలా తయారైందంటే.. ఎన్నికల ఫలితాల్లో "ఇతరులు" కాలమ్‌లో నిలిచిన అభ్యర్థుల్లా మారిందని క్రికెట్ అభిమానులు జోకులు పేలుస్తున్నారు. ప్రతిభ ఉన్నప్పటికీ సీనియార్టీ , ప్రస్తుత ఫామ్ రీత్యా వీరికి అవకాశం దక్కడం కష్టమేనని విశ్లేషకులు భావిస్తున్నారు.



# డయానా సంచలనం

### - క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ సబలెంక పై గెలుపు
### - ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్ స్లామ్ టోర్నీ

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్ స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్ లో పెను సంచలనం నమోదైంది. పురుషుల, మహిళల సింగిల్స్ టాప్ క్లాస్ షట్లర్లంతా ఓటమిపాలైనా.. టాప్ సీడ్ సబలెంక తన ఫామ్ ను కొనసాగిస్తూ క్వార్టర్స్ కు చేరింది. కానీ క్వార్టర్ ఫైనల్లో 25వ సీడ్, రష్యా కు చెందిన దయానా షణైదర్ చేతిలో అనూహ్యంగా ఓటమిపాలైంది. తొలి సెట్ ను సునాయాసంగా గెలిచిన సబలెంక.. ఆ తర్వాత రెండు సెట్ లలో షణైదర్ అద్భుతంగా పుంజుకొని సబలెంక జోరుకు బ్రేక్ వేసింది. దీంతో మూడుసెట్ల హోరా హోరీ పోరులో దయానా షణైదర్ 3-6, 7-5, 6-0తో సబలెంకను ఓడించి సెమీస్ కు చేరింది. షణైదర్ ఒక గ్రాండ్ స్లామ్ టోర్నీ సెమీస్ కు చేరడం ఇదే తొలిసారి. మరో క్వార్టర్ ఫైనల్లో అన్ సీడెడ్, పోలండ్ కు చెందిన చ్వాలిన్స్కా వరుససెట్లలో 22వ సీడ్ కలిన్స్కయా ను చిత్తు చేసింది. హోరా హోరీగా సాగిన క్వార్టర్ ఫైనల్లో ఛ్వాలిన్స్కా 7-6(7-3), 6-3తో కలిన్స్కయా(రష్యా)ను ఓడించింది. గురువారం మహిళల సింగిల్స్ సెమీఫైనల్స్ జరగనున్నాయి.

ఇక పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లోకి 26వ సీడ్ మెన్సిక్(చెక్ రిపబ్లిక్) ప్రవేశించాడు. బుధవారం జరిగిన తొలి క్వార్టర్ ఫైనల్లో మెన్సిక్ 6-4, 6-2, 7-6(7-3)తో 28వ సీడ్, బ్రెజిల్ కు చెందిన ఫోన్సెకాను ఓడించాడు. శుక్రవారం జరిగే తొలి సెమీఫైనల్లో మెన్సిక్ 2వ సీడ్, జర్మనీకి చెందిన అలెగ్జాండర్ జ్వెరేవ్ తో తలపడనున్నాడు. ఇక పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో భారత్ కు చెందిన శ్రీరామ్ బాలాజీ పోరాటం ముగిసింది. బుధవారం జరిగిన క్వార్టర్స్ లో బాలాజీ-డెమోలినర్(బ్రెజిల్) జంట 3-6, 4-6తో 2వ సీడ్, పాటెన్(బ్రిటన్)-హెలియోవారా(ఫిన్లాండ్) చేతిలో ఓటమిపాలయ్యారు.

# జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించండి

- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ కు ఏపీడబ్ల్యూజేఎఫ్ విజ్ఞప్తి
- జర్నలిస్టుల హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లింపుపై కూడా విజ్ఞప్తి
- జర్నలిస్టుల సమస్యలను కలెక్టర్‌కు వివరించిన ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు
- విద్య, వైద్యం విషయంలో స్పష్టమైన హామీ ఇచ్చిన జిల్లా కలెక్టర్



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** జిల్లాలో అక్రిడిటేషన్ జర్నలిస్టుల పిల్లలందరికీ కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఉచితంగా విద్య అందించేలా చూడాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ కు విజ్ఞప్తి చేశారు. గురువారం ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజనేయులు, ఇతర నాయకులు కలెక్టరేట్ లో కలెక్టర్ ఓ. ఆనంద్ ను కలిశారు. ప్రస్తుతం విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో జర్నలిస్టులకు సంబంధించిన కొన్ని అంశాలను కలెక్టర్ కు వివరించారు. అనంతపురం జిల్లాలో 700 మంది అక్రిడేటెడ్ జర్నలిస్టులున్నారని.. వీరిలో అత్యధిక మందికి వేతనాలు కూడా సరిగా అందని పరిస్థితులున్నాయన్నారు. వారికి సాధారణ జీవనం గడవటమే కష్టతరంగా ఉంటోందని.. కుటుంబపరమైన ఖర్చుల్లో ప్రధానమైనవి పిల్లలకు విద్యా, కుటుంబ ఆరోగ్యం కోసం అయ్యే వైద్యం ఖర్చులు అధికంగా ఉంటున్నాయన్నారు. ఈ రెండింటికి మీ సహకారం తోడ్పాటు కావాలని జిల్లా జర్నలిస్టుల తరుపున ఏపీ డబ్ల్యూ జెఎఫ్ నాయకులు కోరారు. విద్యకు సంబంధించి గత కొన్ని సంవత్సరాలుగా జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను జిల్లా కలెక్టర్ ప్రత్యేక ఆదేశాల ప్రకారం అమలు చేస్తూ వస్తున్నారని వివరించారు. ఈ ఏడాది అనంతపురం జిల్లాలోని జర్నలిస్టు పిల్లలకు ఉచిత విద్యను అందించే విధంగా తగిన ఆదేశాలను విద్యాశాఖకి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వైద్యానికి సంబంధించి ప్రభుత్వం బీమా సౌకర్యాన్ని కల్పించిందని.. అయితే ప్రీమియం చెల్లించిన వారికే ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఈ ప్రీమియంకు చెల్లింపునకు సహకరించాలని కోరారు. ఏపీడబ్ల్యుజేఎఫ్ నాయకుల విజ్ఞప్తిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. జర్నలిస్టుల పిల్లల ఉచిత విద్యకు సంబంధించి జిల్లా విద్యాశాఖ అధికారి, యూనియన్ నాయకులతో త్వరలోనే సమావేశం నిర్వహించి తగిన నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. జర్నలిస్టుల హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం కు సంబంధించి సిఎస్ఆర్ ద్వారా అందించే ప్రయత్నం చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజనేయులు మాట్లాడుతూ ప్రస్తుతం జర్నలిస్టులో 90% మంది ఆర్థికంగా జీవ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమాజంపై బాధ్యతతో.. ప్రజల కోసం పనిచేసే జర్నలిస్టులకు వచ్చే వేతనాలు ఏమాత్రం సరిపోక పిల్లలకు మంచి చదువులు అందించలేకపోతున్నారన్నారు. అందుకే కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల్లో వారి పిల్లలకు ఉచిత విద్య అందించే విధంగా చొరవ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. అలాగే హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంకు సంబంధించి కూడా ఉచితంగా అందించే ప్రయత్నం జరుగుతుందన్నారు. ఈ రెండు అంశాలపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని మరోసారి వీటి పై సమావేశమై జర్నలిస్టు కుటుంబ సభ్యులకు హెల్త్ ఇన్సూరెన్స్, వారి పిల్లలకు ఉచిత విద్య అమలైన ఏపీడ బ్ల్యూజేఎఫ్ చొరవ తీసుకుంటుందని రామాంజనేయులు తెలిపారు.

# ఆశలు చూపించి.. ఆవేదన మిగిల్చిన పాలన

- 'వెన్నుపోటుకు రెండేళ్లు' అంటూ నాయుడుపేటలో వైసీపీ నిరసన
- అమలు కాని హామీలపై ప్రభుత్వాన్ని నిలదీసిన మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య
- ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదన్న కిలివేటి సంజీవయ్య
- ప్రజలను మోసం చేసిన ప్రభుత్వమంటూ కిలివేటి ధ్వజం



**నాయుడుపేట– సూర్య వాస్తవం:** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన ప్రభుత్వం ప్రస్తుతం రాష్ట్రాన్ని నిరాశలోకి నెట్టిందని మాజీ సూళ్లూరుపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త కిలివేటి సంజీవయ్య విమర్శించారు. ఆశలు చూపించి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం చివరకు ప్రజలకు ఆవేదన మాత్రమే మిగిల్చిందని ఆయన ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, మాజీ మంత్రి మరియు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి సూచనలతో గురువారం నాయుడుపేట పట్టణంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి "వెన్నుపోటుకు రెండేళ్లు" పేరుతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ, ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు అనేక హామీలు ఇచ్చిన చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. హామీలు నెరవేర్చకుండా మహా నాడు వేదికగా 'సూపర్ సిక్స్ సూపర్ హిట్' అంటూ ప్రకటించుకోవడం ప్రజలను మరింతగా అవమానపరచడమేనని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికే మూడు బడ్జెట్లు ప్రవేశపెట్టినా ప్రధాన హామీల అమలుపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేకపోయింద న్నారు. ఒక గ్యాస్ సిలిండర్ ఇస్తామని చెప్పి, తరువాత మూడు సిలిండర్లకు సంబంధించిన నగదును ఒకేసారి జమ చేస్తామని మాట మార్చారని, ఇలా ప్రజలను మభ్యపెట్టడం ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతి ఆరు నెలలకు ఒకసారి కొత్త పింఛన్లు మంజూరు చేస్తూ పేదలకు అండగా నిలిచారని గుర్తు చేశారు. ప్రస్తుతం మాత్రం కొత్త పింఛన్లు మంజూరు చేయకపోగా, ఇప్పటికే పొందుతున్న పింఛన్లను సైతం తొలగిస్తున్నారని మండిపడ్డారు.

అధికారంలోకి వచ్చిన ఏ ప్రభుత్వం అయినా కనీసం కొంత మేర ఎన్నికల హామీలను అమలు చేయడానికి ప్రయత్నిస్తుందని, అయితే ప్రస్తుత ప్రభుత్వం ఒక్క శాతం హామీని కూడా నెరవేర్చలేకపోయిందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు తమ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. వ్యవసాయ రంగంలో యూరియా కొరత కారణంగా రైతులు బ్లాక్ మార్కెట్‌ను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. మెగా డీఎస్సీ పేరుతో వరుసగా జీవోలు విడుదల చేస్తూ నిరుద్యోగులను అయోమయంలోకి నెట్టారని ఆరోపించారు. ఒక జీవోలో జరిగిన తప్పులను సరిచేయడానికి మరో జీవో తీసుకురావడం ప్రభుత్వ పరిపాలనా వైఫల్యానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందాయని గుర్తు చేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండటంతో రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగు చేసుకున్నారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఇప్పుడు ప్రజలకు ఉపయోగం లేకుండా పోయాయని, అవి కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని ప్రజలు గ్రహించారని అన్నారు. ప్రజలకు జరిగిన అన్యాయాన్ని తెలియజేయడానికే "వెన్నుపోటుకు రెండేళ్లు" నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కిలివేటి సంజీవయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట మండల అధ్యక్షుడు ఒట్టూరు కిశోర్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి, ఓజిలి మండల కన్వీనర్ పాదర్తి హరినాథ్ రెడ్డి, కట్టా భవాని శంకర్ రెడ్డి, స్టేట్ కల్చరల్ వింగ్ కార్యదర్శి కటకం జయరామయ్య, మహిళా నాయకురాలు ఈద రత్నశ్రీ, నాగిరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు పాలేటి నాగార్జున, షేక్ షబీర్ భాషా, కావేరిపాకం అశోక్, భావన్, పేర్నాటి రాహుల్, మెస్ భాస్కర్ రెడ్డి, పేట చంద్రారెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, వాకాటి సోమశేఖర్, హరి రెడ్డి, కాటంరెడ్డి విష్ణు రెడ్డి, కొట్రమంగళం తేజ రెడ్డి, నారాయణరెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# వెన్నుపోటుకు రెండేళ్లు నైరుతిరెడ్డి ఆధ్వర్యంలో హామీల అమలుపై వైఎస్సార్సీపీ ఆందోళన



**గుత్తి – సూర్య వాస్తవం:** గుత్తి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు, గుంతకల్లు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ శాసనసభ్యుడు వై.వెంకటరామిరెడ్డి ఆదేల మేరకు గుత్తి పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద వెన్నుపోటుకు రెండేళ్లు పేరుతో వై సిపి నాయకురాలు నైరుతి రెడ్డి ఆ ధ్వర్యంలో గుత్తి వైసిపి నాయకులు, కార్యకర్తలు కలిసి ప్రత్యేక నిరసనకా ర్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో, ఎన్నికల సమయంలో ప్రజ లకు ఇచ్చిన హామీలను పాలకపక్షం అమలు చేయలేదని ఆరోపిస్తూ నిర సన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల హామీల పత్రాల ప్రతులను దహనం చేసి తమ వ్యతిరేకతను తెలియజేశారు. ఈ సందర్భంగామాట్లా డిన నాయకులు, ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి అధి కారంలోకి వచ్చిన పాలక కూటమి వాటి అమలులో విఫలమైందని విమర్శించారు. ప్రజల ఆశలు నెరవేర్చడంలో ప్రభుత్వం వెనుకబడిందని, ప్రజా సమస్యల పరిష్కారానికి తగిన చర్య లు చేపట్టలేదని ఆరోపించారు. ప్రజ లకు ఇచ్చిన హామీలను వెంటనే అ మలు చేయాలని ప్రభుత్వాన్ని కోరా రు. ప్రజా సంక్షేమానికి సంబంధించిన అంశాలపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమం లో పాలక కూట మికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్య క్షురాలు నైరుతి రెడ్డి, గుత్తి పట్టణ వై సిపి కన్వీనర్ కప్పల బండ మధుసూదన్ రెడ్డి, మాజీ వైసిపి పట్టణ క న్వీనర్ హుస్సేన్ పీరా, మాజీ ము న్సిపల్ ఛైర్మన్ వన్నూర్ భీ, మాజీ ఎంపీపీ. విశాలాక్షి, కోన మురళీధర్ రెడ్డి, గురు, వైసిపి యువ నాయకుడు షఫీ, సుబ్బారెడ్డి, రమేష్ రెడ్డి, మాజీ వైసిపి మున్సిపల్ కౌన్సిలర్లు, గుత్తి పట్టణం మండలానికి చెందిన వైసీపీ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, పార్టీ కార్యక ర్తలు, అభి మానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వెన్నుపోటుకు రెండేళ్లు"

**- కూటమి ప్రభుత్వంపై వైసీపీ త్రిలోకనాథరెడ్డి ఆధ్వర్యంలో నిరసన**



**కూడేరు– సూర్య వాస్తవం :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపుమేరకు, ఉరవకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మరియు పీఏసీ మెంబర్ వై. విశ్వేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు కూడేరు మండల పార్టీ ఆధ్వర్యంలో "వెన్నుపోటుకు రెండేళ్లు" నిరసన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

**అబద్ధపు హామీలతో మోసం వైసీపీ నాయకుల ధ్వజం**

ఈ సందర్భంగా కూడేరు మండల పర్యవేక్షకుడు త్రిలోక్ నాథ్ రెడ్డి, ఆధ్వర్యంలో ఎంపీపీ నారాయణరెడ్డి, మండల కన్వీనర్ రామచందర్ రెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్ రెడ్డిలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. వారి ప్రసంగంలోని ముఖ్యమైన అంశాలు అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్నా, ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేస్తూ మొదటి సంతకం చేసిన మెగా డీఎస్సీని సక్రమంగా నిర్వహించకుండా నిరుద్యోగులకు తీరని అన్యాయం చేశారు. డీఎస్సీ ఉద్యోగాలను తమ పార్టీ నాయకులకు అమ్ముకున్న ఏకైక ప్రభుత్వం ఇది. ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రశ్నించిన వారిపై ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తూ వేధిస్తోంది. ఏ ఒక్క సంక్షేమ కార్యక్రమం అమలు చేయకుండా, లక్షల కోట్ల రూపాయల అప్పులు చేస్తూ రాష్ట్రాన్ని దివాలా తీసే పరిస్థితికి తీసుకొచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేవేంద్ర (వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు), ధనుంజయ్ (వాలంటరీ వింగ్ జిల్లా అధ్యక్షుడు), సౌ రెడ్డి (పార్టీ సీనియర్ నాయకులు), గంగాధర్ (ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ అధ్యక్షుడు) సిద్ధారెడ్డి (రైతు విభాగం మండల అధ్యక్షుడు), దేవా (వైస్ ఎంపీపీ) రంగారెడ్డి, ధనంజయ (మాజీ సర్పంచులు),

**ముఖ్య నాయకులు:** కిష్టప్ప, రామాంజనేయులు, హాయ్ నరేష్, చంద్రశేఖర్, శంకర్ నాయక్

**యువజన విభాగం:** కేశన్న (యూత్ కన్వీనర్), వేణు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకుని ప్రజా వ్యతిరేక విధానాలను వీడనాడాలని, లేనిపక్షంలో ప్రజల పక్షాన వైఎస్సార్సీపీ పోరాటాలను మరింత ఉధృతం చేస్తుందని నాయకులు హెచ్చరించారు.

# కూటమి ప్రభుత్వం మేనిఫెస్టో ప్రతుల దగ్ధం



**వేముల - సూర్య వాస్తవం:** మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్లమెంట్ సభ్యులు వైయస్ అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో వెన్నుపోటు కు రెండేళ్లులి నిరసన కార్యక్రమం లో భాగంగా కూటమి ప్రభుత్వం మేనిఫెస్టో ప్రతులను దగ్ధం చేయడం జరిగింది. కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వమని చేతుల ప్రభుత్వం కాదని ఓట్లేసి గెలిపించిన రాష్ట్ర ప్రజలను రెండేళ్లుగా మాయమాటలు చెబుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు వెన్నుపోటు పొడుస్తూ ఉన్నాడని వెన్నుపోటు పొడవడంలో చంద్రబాబు దిట్టని మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పిటిసి కోకటం వెంకట బయపు రెడ్డి లు అన్నారు. గురువారం పార్టీ ఆఫీసులో వెన్నుపోటుకు రెండేళ్ల పోస్టర్లు, సూపర్ సిక్స్ పోస్టర్లను దగ్ధం చేశారు. మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు మాయమాటలు చెప్పి అధికారకంలోకి వచ్చాక వాటిని విశ్వసించారు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న పథకాలన్నింటినీ కొనసాగిస్తామని ఇంకా అదనంగా కొత్త పథకాలను అమలు చేస్తామని చెప్పిన కూడా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలను అమలు చేయకుండా నమ్మిన ప్రజలకు వెన్నుపోటు పొడిచింది అన్నారు. రాష్ట్రంలో 18 సంవత్సరాలు దాటిన మహిళలందరికీ ఆడబిడ్డ నిధి ద్వారా నెలకు రూ 1500 అందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన ఏ ఒక్కరికి ఇచ్చిన పాపాన పోలేదని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగులు ఇస్తామని ఉద్యోగం వచ్చే లోపు ప్రతి ఒక్కరికి నెలకు రూ 3000 నిరుద్యోగ భృతి ఇస్తామని నిరుద్యోగులకు మాయమాటలు చెప్పడం జరిగిందన్నారు. ఇప్పటివరకు ఏ ఒక్కరికి కూడా ఉద్యోగం ఇచ్చిన పాపాన పోలేదు అంతేకాకుండా అన్నదాత సుఖీభవ పథకాల కానీ అమలు చేస్తామని ఏడాదికి రూ 20000 ఇస్తామని చెప్పిన చంద్రబాబు రైతులను నట్టేట ముంచేరని తెలిపారు. జగనన్న పాలనలో రైతన్నలకు ఉచిత బీమా పథకాన్ని అమలు చేశారని వారు గుర్తు చేశారు. ఇప్పుడు రైతు ప్రీమియం చెల్లించాల్సి వస్తుందని ఇది రైతులకు భారంగా మారిందని మండిపడ్డారు. ఆరోగ్యశ్రీ అటకెక్కించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగమే అమలు చేశారు తప్ప అభివృద్ధి చేసిన పాపాన పోలేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీమాల్ రెడ్డి, ఎంపీటీసీ రామచంద్రారెడ్డి రామసుబ్బారెడ్డి, నాగేళ్ల మహేష్ రెడ్డి ప్రవీణ్ కుమార్ రెడ్డి, చందా శివ రెడ్డి, చందా రమేష్ రెడ్డి పోరెడ్డి రాఘవరెడ్డి, మాజీ ఎంపిటిసి రాధాకృష్ణయ్య, మదర్ షా వల్లి, చలపతి, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, మున్నీరు, సోహెల్, నారాయణరెడ్డి, చిన్న సుబ్బారెడ్డి, నడిపి సుబ్బారెడ్డి, చలమారెడ్డి, ఎంపీటీసీ వెంకటస్వామి, చంద్రశేఖర్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి, రవిశంకర్ రెడ్డి చెల్లుబోయిన రెడ్డయ్య, మాజీ సర్పంచులు వడ్డారపు నారాయణస్వామి, నాగప్ప, అర్జున్, జిల్లా యువజన విభాగం మెంబెర్ చల్ల సునీల్ కుమార్, పులివెందుల వికలాంగుల అధ్యక్షుడు చాగలేటి భాస్కర్, మండల ఉపాధ్యక్షుడు నరుబోయిన గంగాధర్ యాదవ్, పి.బి.వి భాస్కర్ రెడ్డి, హరిబాబు, గుజ్జుల సుదర్శన్ రెడ్డి, వర్ర రవీందర్ రెడ్డి, ఐటీ వింగ్ సుభాష్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad )

# వెన్నుపోటుకు రెండేళ్లు

**- కూటమి ప్రభుత్వంపై వైసీపీ శ్రేణుల నినాదాలు**





**వజ్రకరూరు - సూర్య వాస్తవం:** వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి సి.పి. వీరన్న ఆధ్వర్యంలో వజ్రకరూరులో వైస్సార్సీపీ శ్రేణులు నిరసన కార్యక్రమం చేపట్టాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండి పడుతూ, "వెన్నుపోటుకు రెండేళ్లు" అంటూ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైసీపీ అధికార ప్రతినిధి సి.పి. వీరన్న మాట్లాడుతూ, రాష్ట్రమంతటా వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుతో ప్రజలకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు ప్రభుత్వానికి రెండేళ్లు అనేటువంటి కార్యక్రమాన్ని నిరసనలు ర్యాలీలు అదేవిధంగా ఆయన ఇచ్చినటువంటి హామీలను అమలు చేయనటువంటి ఈ ఎన్నికల మేనిపెస్టోని దహనం చేయడం జరుగుతుంది. మేము ఒకటే చెబుతున్నాం . వెన్నుపోటు ప్రభుత్వం అంటే వాళ్ల మామకు చంద్రబాబు నాయుడు వెన్నుపోటు పొడిచినాడు కదా మళ్లీ వీళ్ళు వెన్నుపోటు అంటున్నారు ఏమిటంటే మన వజ్రకరూరు మండలానికి జగన్ మోహన్ రెడ్డి 2019 నుండి 2024 వరకు ఐదు సంవత్సరాల కాలంలో ఈ వజ్రకరూరు మండలంలో ఎంతమంది అర్హులు ఉన్నారు వందకి 85 నుంచి 90 మందికి దాదాపు 276 కోట్ల రూపాయలు బటన్ నొక్కి పైసా అవినీతి లేకుండా ఎవరికి వెన్నుపోటు పొడవకుండా ఇచ్చిన హామీలను అమలు చేసిన దమ్మున్న నాయకుడు జగన్మోహన్ రెడ్డి మేము అంత ధైర్యంగా ప్రజలకు వెన్నుపోటు పొడిచావని జగన్మోహన్ రెడ్డి చెబుతున్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో కూడా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇద్దరు కూడా వజ్రకరూరు మండల ప్రజలకు వెన్నుపోటు పొడిచారని విశ్వేశ్వర్ రెడ్డి మేము చెబుతున్నాము ఈరోజు మీరు చెప్పండి ధైర్యంగా వజ్రకరూరు మండలానికి ఈ రెండు సంవత్సరాల కాలంలో మీరు ఏ న్యాయం చేసినారు ఎంతమందికి పంట బీమా ఇన్సూరెన్స్ గిట్టుబాటు ధర ఎంత మంది రైతుల నుండి పంట కొనుగోలు చేసినారు అని చెప్పమంటే లెక్కలేస్తారు తప్ప వాళ్ళు ఏమి మాట్లాడలేరు వెన్నుపోటు పొడవాలనుకున్నారు ఈ వజ్రకరూరు మండలంలో రెండేళ్లయిన వాళ్లు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదు అందుకనే నేను చెబుతున్నాం ఇప్పుడు నిరసన కార్యక్రమం మాత్రమే చేస్తున్నాం వచ్చే సంవత్సరం నుండి రాష్ట్రమంతటా పెద్దపెద్ద ఉద్యమాలు జరుగుతాయి వజ్రకరూరు మండలం వైయస్సార్సీపీకి గుండెకాయ లాంటిదని సిపి వీరన్న తెలియజేశారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, కేవలం వెన్నుపోటు రాజకీయాలకే పరిమితమైందని విమర్శించారు. నియోజకవర్గ, జిల్లా స్థాయి అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని, ప్రజలు త్వరలోనే ఈ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైస్సార్సీపీ ముఖ్య నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీ కాదు అది దగా డిస్సీ

**- ప్రజలను నమ్మించి కుచ్చుటోపి పెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు**
**- చంద్రబాబు మోసాలను ప్రజలు ఎండ కట్టాలి**
**- ప్రభుత్వ మేనిఫెస్టోను దగ్ధం చేసిన వైసీపీ కడప జిల్లా ఉపాధ్యక్షులు డివి శశికాంత్ రెడ్డి**



**తొండూరు - సూర్య వాస్తవం :**

ఎన్నికలకు ముందు ప్రజలను నమ్మించి అధికారం దక్కించుకున్నాక చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు కుచ్చుటోపి పెట్టాడని, డీఎస్సీ కాదు అది దగా డిఎస్సి అని, చంద్రబాబు పాలన రెండేళ్లు పూర్తయిందని, చంద్రబాబు ఇచ్చిన హామీలను ఇంతవరకు నెరవేర్చక పోవడం దారుణమని కడప జిల్లా వైస్సార్సీపీ ఉపాధ్యక్షుడు డివి శశికాంత్ రెడ్డి అన్నారు. తొండూరులో చంద్రబాబు మోసాల మేనిఫెస్టోను వైకాపా నాయకులతో కలిసి గురువారం దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చేందుకు రాష్ట్ర ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను తుంగలో తొక్కాడ న్నారు. రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేసిన పథకాలను ఆయన కొనసాగిస్తున్నారు. కొత్త పథకాలు అమలు చేస్తామని చెప్పి ఇంతవరకు ఒక్కటి కూడా చేయలేదన్నారు. రాష్ట్రంలో 18 సంవత్సరాల దాటిన మహిళలందరికీ ఆడబిడ్డ నిధి కింద నెలకు 1500 రూపాయలు అందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి రెండేళ్లు అయినా ఒక రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఉద్యోగం వచ్చేంతవరకు ప్రతినెల ఒక్కొక్కరికి నెలకు 3000 రూపాయల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఇంతవరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తామని ఏడాదికి రావే వేల రూపాయలు ఇస్తామని చెప్పి చంద్రబాబు నాయుడు రైతులను నట్టేట ముంచారన్నారు.

చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో నిత్యవసర సరుకులు, పెట్రోల్ డీజిల్ అమాంతంగా పెరిగాయి అన్నారు. ఆరోగ్యశ్రీని అటకెక్కించిన నాయకుడు చంద్రబాబు నాయుడు అన్నారు. 50 సంవత్సరాలకే ఎస్సీ ఎస్టీ బీసీలకు పెన్షన్ ఇస్తానని చెప్పి వారిని కూడా మోసం చేసిన ఘనత చంద్రబాబు నాయుడుది అన్నారు. మోసాల బాబును రాష్ట్ర ప్రజలు గద్దె దించేందుకు ఎదురుచూస్తున్నారు అన్నారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అని చంద్రబాబు నాయుడు డబ్బులు వాయించుకుంటున్నాడు తప్ప సూపర్ ఫ్లాప్ అయిందని గ్రహించలేకున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్,మాజీ ఎంపీటీసీ లు,మాజీ సర్పంచ్ లు,వివిధ అనుబంధ విభాగాలు కలిగిన వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# "బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ"

**- కుర్చీ కోసం అడ్డగోలు హామీలు**
**- నమ్మించి నట్టేట ముంచిన**
**- కూటమి ప్రభుత్వం**



**పులివెందుల - సూర్య వాస్తవం**

బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ" అంటూ ఆంధ్ర ప్రదేశ్ ప్రజలకు చంద్రబాబు నాయుడు వెన్నుపోటు పొడిచి నేటికి రెండేళ్లు. పూర్తయిన, సూపర్ సిక్స్ సహా 143 హామీలతో ప్రజలను నమ్మించి.. ఎన్నికల్లో విజయం సాధించి అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయకుండా చేస్తున్న మోసంపై వైయస్ఆర్సీపీ వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన కార్యక్రమాలను ఉద్యమంలా చేపట్టింది. గురువారం పులివెందులలోని స్థానిక పాత ఎమ్మెల్యే కార్యాలయంలో వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్లమెంట్ సభ్యులు వైయస్ అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో వెన్నుపోటుకు రెండేళ్లులి నిరసన కార్యక్రమంలో భాగంగా వైయస్ మనోహర్ రెడ్డి, వైయస్ మదన్ మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, పులివెందుల పట్టణ వైకాపా కన్వీనర్ హాల్ గంగాధర్ రెడ్డి, మాజీ మహిళ కౌన్సిలర్ల చేతుల మీదుగా పెద్ద ఎత్తున పాల్గొన్న వైసీపీ నాయకుల సమక్షం లో కూటమి మేనిఫెస్టో ప్రతులు దహనం చేశారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ అధికారంలోకి రావడానికి ముందు కుర్చీ కోసం అడ్డగోలు హామీలు ఇచ్చి,నేడు రెండేళ్ల పాలన ముగిసినా ప్రజలపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని మండి పడ్డారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఏవి అన్నదాతలకు ఇచ్చిన భరోసా ఏది అని వారు ప్రభుత్వాన్ని నిలదీశారు.నాడు నమ్మించి ఓట్లేయించుకుని,నేడు అడుగడుగునా మోసాలు చేస్తూ ప్రజల కళ్లల్లో కన్నీళ్లు తెప్పిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసింది అని చంద్రబాబు మోసాలకు బూటకపు వాగ్దానాలను రెండేళ్లు పూర్తి కావస్తున్న సందర్భంగా వెన్ను పోటుకు రెండేళ్లు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని , ఏ ఒక్క వర్గం కూడా సంతృప్తి గా లేరన్నారు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేరు వింటేనే ప్రస్తుత అధికార కూటమి నాయకులకు రాత్రి పూట నిద్ర కూడా పట్టడం లేదని వైఎస్సార్సీపీ నాయకులు తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే వరకు,కూటమి ప్రభుత్వాన్ని అడుగడుగునా నిలదీస్తూనే ఉంటాం అని ప్రజల పక్షాన వైసీపీ పోరాటం చేస్తూనే ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పద్మనాభ రెడ్డి, రవి, బ్యాటరీ ప్రసాద్,ఓ రసూల్, వీరారెడ్డి, వైకాపా నాయకులు ప్రజలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

# ఘనంగా సంకష్టహర చతుర్థి వ్రతం



**అనంతపురం - సూర్య వాస్తవం :**అనంతపురం పట్టణంలోని స్థానిక శ్రీనివాస్ నగర్ లో గల శ్రీ సీతారామాంజనేయ దేవస్థానంలో ప్రతినెల పౌర్ణమి మూడు రోజుల తర్వాత వచ్చే చతుర్థి రోజున సాయంకాలం ఉచితంగా భక్తాదుల సమక్షంలో శ్రీ సంకష్టహర చతుర్థి వ్రతం ఘనంగా నిర్వహించారు. సాయంకాలం 6-30 గంటల నుండి పూజా కార్యక్రమాలు మొదలై 8-30 గంటలకు మహా మంగళారతి భక్తులందరికీ ప్రసాదం వినియోగం జరిగిందని శ్రీ సీతారామాంజనేయ దేవస్థానం ఆలయ ధర్మకర్త ఆళ్లగడ్డ రాము తెలియజేసారు

# మహిళల భద్రతలో 100శాతం ప్రజల నమ్మకాన్ని సాధించాలి

**- జిల్లా ఎస్పీ పి.జగదీష్**



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం**




జిల్లాలో మహిళల భద్రత, రక్షణే ధ్యేయంగా పోలీస్ శాఖ ప్రత్యేకంగా అమలు చేస్తున్న 'స్త్రీరక్ష' పోర్టల్ పనితీరుపై ఈరోజు స్థానిక జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఉన్నతాధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.?ఈ సందర్భంగా 'స్త్రీరక్ష' పోర్టల్ పబ్లిక్ ఔట్రీచ్ కార్యక్రమంలో భాగంగా.. జిల్లా వ్యాప్తంగా ఇళ్లకు వెళ్లి మహిళల భద్రత, వారి సమస్యలపై క్షేత్రస్థాయిలో విస్తృతంగా సర్వే నిర్వహించిన పోలీస్ స్టేషన్ల సిబ్బందిని ఎస్పీ గారు నేరుగా సమావేశమయ్యారు. స్త్రీరక్ష పోర్టల్ సర్వేలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, ఎక్కువ మంది మహిళలను రీచ్ అయిన టాప్-5 మహిళా పోలీసులను మరియు ఆయా పోలీస్ స్టేషన్ల సిబ్బందిని ఎస్పీ గారు ప్రత్యేకంగా జిల్లా కేంద్రానికి రప్పించి, వారిని అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు.

**100శాతం రీచ్ కావడమే లక్ష్యం....జిల్లా ఎస్పీ**

జిల్లాలోని ప్రతి మహిళకు 'స్త్రీరక్ష' పోర్టల్ గురించి మరియు వారి సమస్యలను పోలీసు స్టేషన్లకు వెళ్లకుండా ఎలా పరిష్కరించుకోవచ్చో, తదితర పూర్తి సమాచారం తెలవాలి. ఈ పోర్టల్ ద్వారా ప్రజల్లో, ముఖ్యంగా మహిళల్లో పోలీస్ సేవలపై 100 శాతం సానుకూల దృక్పథం, నమ్మకం (పబ్లిక్ పెర్సెప్షన్ ) పెంపొందేలా అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా పనిచేయాలి.

**ఇంటింటి సర్వే**

మహిళా పోలీసులు నేరుగా ఇళ్లకు వెళ్లి, మహిళల భద్రతపై సర్వే నిర్వహించి, వారిలో ధైర్యాన్ని నింపడం అభినందనీయం. టాప్-5 లో నిలిచిన సిబ్బందిని స్ఫూర్తిగా తీసుకుని జిల్లాలోని మిగతా సిబ్బంది కూడా అదే ఉత్సాహంతో సర్వేను ముందుకు తీసుకెళ్లాలని...పోర్టల్ ద్వారా మరియు సర్వేలో వచ్చే ఫిర్యాదులు, సమస్యలపై పోలీసులు తక్షణమే స్పందించి బాధితులకు అండగా నిలవాలి. తద్వారా సమాజంలో మహిళలకు పోలీస్ శాఖపై మరింత భరోసా పెరుగుతుందన్నారు.ఈకార్యక్రమంలో ట్రైనీ ఐపిఎస్ అధికారి శ్రీ అశ్విన్ మణిదీప్ , అదనపు ఎస్పీ ఎస్ మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు

